


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :117 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ సోమవారం 30 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :117 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA MON 30 DECEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

# చంద్రబాబూ.. విజన్ అంటే అప్పులేనా?

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఫైర్
- 6 నెలల్లోనే రూ.1,12,750 కోట్ల అప్పులు
- రాష్ట్ర చరిత్రలో కూటమి ప్రభుత్వం రికార్డ్
- రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన విజనరీ చంద్రబాబు
- విజన్-2047 డాక్యుమెంట్ పేరుతో నానా హంగామా
- మరోసారి మ్యానిఫెస్టో అమలుకు మంగళం
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆక్షేపణ
- 'సూపర్ సిక్స్' ఊసే ఎత్తని సీఎం చంద్రబాబు
- కానీ అట్టహాసంగా 23 ఏళ్ల విజన్ డాక్యుమెంట్
- మళ్లీ మోసపూరిత హామీలు. వంచిస్తున్న చంద్రబాబు
- అడ్డగోల హామీలతో ప్రజలను నమ్మించడం
- అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కటీ విస్మరించడం
- అదే చంద్రబాబు అలవాటు. నిరంతర ప్రక్రియ
- మ్యానిఫెస్టోను చిత్తశుద్ధితో అమలు చేసిన ఘనత మాది
- మాజీ మంత్రి బుగ్గన స్పష్టీకరణ
- ప్రెస్‌మీట్‌లో గణాంకాలతో సహా ఎండగట్టిన బుగ్గన



**పెన్ పవర్ డెస్క్:**విజన్ అంటే అప్పులు చేయడమేనా అని వైయస్‌ఆర్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అప్పుల్లో కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర చరిత్రలోనే ఇప్పటి వరకు ఎవరూ చేయని విధంగా కేవలం ఆరు నెలల కాలంలోనే ఏకంగా రూ.1,12,750 కోట్ల అప్పులతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఒక సరికొత్త రికార్డ్ సృష్టించిందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చురకలంటించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా 3 నెలలున్నప్పటికీ ఇన్ని కోట్ల అప్పులు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని ఆయన గుర్తు చేశారు. గత వైయస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, వినాశనం చూశామంటున్న కూటమి పాలకులు, ఇప్పుడు తాము చేస్తున్న నిజమైన విధ్వంసాన్ని ఎలా సమర్థించుకుంటారని నిలదీశారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**అర్థం కాని పరిస్థితి:**

అలవి కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం, వైయస్సార్‌సీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిందని పదే పదే ఆరోపణలు చేస్తోంది. తమ అనుకూల ఎల్లో మీడియా గత మా ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తోంది. మా హయాంలో రూ.14 లక్షల కోట్ల అప్పులు చేశామని పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారు. కానీ, ఈ ఆరునెలల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు, రుణాల కోసం కుదుర్చుకున్న ఒప్పందాలు, కమిట్‌మెంట్స్ చూస్తే రాష్ట్రాన్ని ఎటు తీసుకుపోతున్నారో అర్థం కాని పరిస్థితి.

**ప్రతి నెలా అప్పులే. అయినా ఎల్లో మీడియా పలకదు:**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి నెలా అప్పులే. అధికారం చేపట్టిన రెండు వారాల్లోనే జూన్ 24న రూ.6 వేల కోట్లు, జూలై 24న రూ.10 వేల కోట్లు, ఆగస్టులో రూ.3 వేల కోట్లు, సెప్టెంబరులో రూ.4 వేల కోట్లు, అక్టోబరులో రూ.6 వేల కోట్లు, నవంబరులో రూ.4 వేల కోట్లు, డిసెంబరులో రూ.9,237 కోట్ల అప్పు చేశారు. మా హయాంలో ప్రతిరోజూ రాష్ట్రం దివాలా తీస్తోందంటూ ఎల్లో మీడియా పెద్ద ఎత్తున కథనాలు రాసింది. మరి ఇప్పుడ కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు వారికి కనిపించడం లేదా? ఆనాడు రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ రాశారు.

వివరాలు 2లో..

## సౌత్ కొరియాలో ఘోర ప్రమాదం
# 179 మంది మృతి

- ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘోర ప్రమాదం
- విమానంలోని 175 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది సజీవ దహనం
- ల్యాండింగ్ గేర్, టైర్లు పనిచేయకపోవడమే కారణం!
- ఎయిర్‌పోర్టు మూసివేసిన అధికారులు



**పెన్ పవర్ డెస్క్:**దక్షిణ కొరియాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అందులో ఉన్న ఇద్దరు తప్ప అందరూ మరణించారు. ప్రమాద సమయంలో విమానంలో 175 మంది ప్రయాణికులతోపాటు ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఈ ప్రమాదంలో 179 మంది మరణించినట్టు యాంహాప్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన ది జేజు ఎయిర్ ఫ్లైట్‌కు చెందిన 7సి2216 బోయింగ్ 737-800 విమానం దక్షిణ కొరియాలోని ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయం లో ల్యాండ్ అవుతూ అదుపుతప్పింది. విమానాశ్రయ రక్షణ గోడను ఢీకొని కాలిబూడిదైంది. విమానం ల్యాండింగ్ గేర్‌లో సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. విమానం అంతకుముందే ల్యాండింగ్‌కు ప్రయత్నించి విఫలమైన ట్టు అధికారులు తెలిపారు. ల్యాండింగ్ తర్వాత విమానం రన్‌వే చివరికి వస్తున్నా వేగాన్ని నియంత్రించుకోలేక ఎయిర్ పోర్టు గోడను బలంగా ఢీకొట్టింది.

దీంతో అందులోని ఇంధనం ఒక్కసారి మండిపోయి మంటలు వ్యాపించాయి. ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న దాని ప్రకారం విమానం ల్యాండింగ్ సమయంలో గేర్, టైర్లు పని చేయలేదు. ఏదైనా పక్షి ఢీకొనడం వల్ల అవి పనిచేయకపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘోర విషాదంపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ స్పందించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలకు మార్గదర్శకాలు, ఆదేశాలు జారీచేశారు. ప్రమాదం కారణంగా ముయాన్ ఎయిర్‌పోర్టును మూసివేశారు.

## పేర్నినానికి జేసీ ప్రభాకర్ రెడ్డి కౌంటర్

- పవన్ మంచోడు కాబట్టి ఊరుకున్నాడన్న జేసీ
- మీకు మాత్రమే పిల్లలు ఉన్నారా.. మాకు లేరా అంటూ ఫైర్
- అసెంబ్లీలో భువనేశ్వరి గురించి ఎన్ని మాటలు అన్నారు..
- మంత్రిగా ఉన్నప్పుడు మహిళలు గుర్తురాలేదా అని నిలదీత



**పెన్ పవర్ డెస్క్:** రేషన్ బియ్యం వ్యవహారంలో మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని ఆరోపణలకు జేసీ ప్రభాకర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మహిళలు, పిల్లలు అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారు... మంత్రిగా ఉన్నప్పుడు మహిళలు గుర్తురాలేదా? అంటూ ప్రశ్నించారు. భార్యాపిల్లలు పేర్ని నానికేనా... మాకు లేరా? అని నిలదీశారు. వైసీపీ పాలనలో అధికారం చేతిలో ఉందనే ధీమాతో పేర్ని నాని చేసిన అరాచకాలను జేసీ ఏకరువు పెట్టారు. అంతేకాదు,

వివరాలు 2లో..

## భయపడకండి.. మా ప్రాజెక్ట్‌తో ముప్పు లేదు



**పెన్ పవర్ డెస్క్:**టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్ డ్యామ్‌ను నిర్మించాలనే తన ప్రణాళికను చైనా సమర్థించుకుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో దిగువనున్న దేశాలపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. నది నీరు ప్రవహించే పరిసర రాష్ట్రాల్లో భద్రత సమస్యలు దృష్టిలో ఉంచుకునే నిర్మాణం చేపడతానని స్పష్టం చేసింది. ఇందుకు దశాబ్దాలుగా అధ్యయనం చేసినట్టు పేర్కొంది. బ్రహ్మపుత్ర నదిపై టిబెట్‌లోని భారత సరిహద్దుకు సమీపంలో నెలకొల్పనున్న ఈ భారీ డ్యామ్ నిర్మాణానికి ఈ నెల 25న చైనా ఆమోదం తెలిపింది. దీనిపై భారతదేశం, బంగ్లాదేశ్

వివరాలు 2లో..

## ఎట్టి పరిస్థితుల్లో ఢిల్లీలో బీజేపీని గెలవనివ్వం



**పెన్ పవర్ డెస్క్:**అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండు నెలల సమయం ఉండగానే ఢిల్లీలో పొలిటికల్ హీట్ పెంచుకు తున్నారు ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్. ఓ వైపు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతూనే.. మరోవైపు ప్రత్యర్థులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై విరుచుకుపడుతు న్నారు. ఆకట్టుకునే పథకాలు ప్రకటిస్తూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం (డిసెంబర్ 29) ఢిల్లీలో ప్రచారం నిర్వహించిన కేజ్రీవాల్ ఓటర్ల జాబితా వివాదంపై బీజేపీని టార్గెట్ చేస్తూ హాట్ కామెంట్స్ చేశారు.

వివరాలు 2లో..

## భార్య పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటు

### పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

- పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్ నుంచి బియ్యం మాయం కేసు నమోదు
- పేదల బియ్యం స్వాహా చేసి నీతి కబుర్లు చెబుతున్నారన్న మంత్రి కొల్లు రవీంద్ర
- పేర్ని నానికి, ఆయన బినామీలకు చుక్కలు చూపిస్తామని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్న గోడౌన్ నుంచి బియ్యం మాయం కావడంపై మంత్రి కొల్లు రవీంద్ర మరోసారి స్పందించారు. పేర్ని నానిని ఉద్దేశించి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పేదల బియ్యం స్వాహా చేసి నీతి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. చోరీ చేసి డబ్బు తిరిగి ఇచ్చేసినంత మాత్రాన దొరఅయిపోరని,

వివరాలు 2లో..

## నా మాతృభాష మరాఠీ... కానీ...!

- విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు
- హాజరైన ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్
- తమ కుటుంబం 400 ఏళ్ల కిందట మహారాష్ట్ర నుంచి వచ్చిందని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరంగా ప్రసంగించారు. పసిబిడ్డలు ఓ భాష నేర్చుకుంటున్నామని తమకు తెలియకుండానే, అనుకరణ ద్వారా, చుట్టూ ఉన్న వాళ్లను గమనించడం

వివరాలు 2లో..

## నాటి గుంతల రోడ్డే నేడు ఇలా రహదారిగా మారింది



- ఇంటికో స్విమ్మింగ్ పూల్ అంటూ సోషల్ మీడియాలో వైరల్ గా మారిన పోస్టు
- నాడు వ్యంగ్యంగా పోస్టులు.. నేడు అభివృద్ధికి చిహ్నామంటూ నెటిజన్ల వ్యాఖ్యలు
- కాంట్రాక్టర్ కు కూటమి సర్కారు పెండింగ్ నిధులు విడుదల చేయడంతో రోడ్డుకు మోక్షం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మళ్లీ అదే ట్రాక్ లో బాబు .. జనం మూడ్ ఏంటో ?

ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి. చంద్రబాబు అంటే అభివృద్ధికి చిరునామా అని అంటారు. ఆయన ఎపుడూ డెవలప్మెంట్ అని నినదిస్తూ ఉంటారు. ఆయన ఏదైనా ఒక ప్రాజెక్ట్ టేకప్ చేస్తే దాని వల్ల పది మందికి ఉపయోగపడాలని కోరుకుంటారు. ఆయన 1995లో తొలిసారి సీఎం అయినప్పటి నుంచి ఇదే విధానం అనుసరిస్తూ వస్తున్నారు.

ఆయనలో సంస్కరణవాది ఎపుడూ డామినేట్ చేస్తూ ఉంటారు. ఆయన వినూత్న ఆలోచనలు కూడా దానికి కారణంగా ఉంటూ వస్తున్నాయి. ఆయన ఉమ్మడి ఏపీలో తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి మంత్రమే జపించారు. సంక్షేమం అన్నది ఆయనకు ఆ తరువాత ప్రయారిటీగా మారింది. అందుకే 1999 ఎన్నికల్లో ఆయనకు అత్తెసెరు మార్కులే వచ్చాయి. అలా ఆయనకు అధికారం అయితే బొటా బొటీ మెజారిటీతో దక్కింది. 2004 నాటికి ఏకంగా అధికారం చేజారింది. దానికి కారణం కాంగ్రెస్ సంక్షేమ అజెండాతో ముందుకు రావడం. దాని ముందు టీడీపీ డెవలప్మెంట్ సరితూగలేకపోయింది. ఇక 2009 నాటికి బాబు కూడా సంక్షేమ మంత్రం పఠించినా వైఎస్సార్ ముందు తేలిపోయారు.

అలా ఉమ్మడి ఏపీలో మళ్లీ సీఎం కాలేకపోయారు. ఇక 2014లో విభజన ఏపీలో ఆయన ఉచిత పథకాలు హామీలతో అధికారంలోకి వచ్చారు. అయితే ఆయన చెప్పినవి అన్నీ చేయలేకపోయారు. ముఖ్యంగా రైతు రుణాల మాఫీ వ్యవహారం కానీ డ్వాక్రా మహిళల రుణాల మాఫీ కానీ ఇతర కీలక హామీలు కానీ అమలు చేయలేదు.

దాంతో 2019లో దెబ్బ పడింది. నిజానికి 2014 నుంచి 2019 మధ్యలో బాబు ఏపీకి రాజధాని కావాలని ఆలోచించి ఆ దిశగానే అడుగులు వేశారు. ఆయన అమరావతి రాజధాని వస్తే కనుక ఏపీ మొత్తం బాగుపడుతుందని భావించేవారు కానీ జనాలకు అభివృద్ధి కంటే సంక్షేమం మీదనే మోజు ఉందని గ్రహించలేకపోయారు.

ఆనాడు జగన్ ఇచ్చిన అనేక ఉచిత హామీలను మెచ్చి 151 సీట్లతో ఆయనకు పట్టం కట్టారు. ఇక 2024 నాటికి బాబు కూడా అదే రూట్లోకి వెళ్ళారు. సూపర్ సిక్స్ అంటూ ఆయన ఊరూరా తిరిగి జనాలకు వాటిని చేరువ చేశారు. తాము అధికారంలోకి వస్తే రెట్టింపు ఉచితాలు ఇస్తామని కూడా ఊరించారు. దాంతో జనాలు అంతా కూటమి వైపు వచ్చేసి జై కొట్టారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఒక్క పించన్ పెంపు తప్ప మరేమీ అమలు కావడం లేదు. సూపర్ సిక్స్ అన్నది ఎక్కడో ఉండిపోయింది. దాని కి అయితే డబ్బులు లేవు. ఖజానా వెక్కిరిస్తోంది. ఇంకో వైపు చూస్తే అమరావతిని ఈసారి చాలా సీరియస్ గా బాబు తీసుకున్నారు. దాని కోసం నిధుల సేకరణ చేస్తున్నారు. తనకు ఇచ్చిన ఈ అయిదేళ్ల టెర్మ్ లో అమరావతి రాజధానిని పూర్తి చేసి చూపించాలని అనుకుంటున్నారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ ని తాను పూర్తి చేసి ఎనభయ్యేళ్ల ఆంధ్రుల కలను తీర్చిన వారిగా చరిత్రలో నిలవాలని చూస్తున్నారు. ఈ రెండూ చేస్తే కచ్చితంగా తనను 2029లో జనాలు ఆదరిస్తారు అన్నది బాబుకు ఉన్న గట్టి నమ్మకంగా చెబుతున్నారు. అయితే బాబు అభివృద్ధి మంత్రం మళ్లీ టీడీపీని అధికారంలోకి తెస్తుందా అంటే దాని మీదనే చర్చ సాగుతోంది. జనాల మూడ్ గతంలోలా లేదు. వారిది వ్యక్తిగత అజెండాగా ఉంటోంది. పైపెచ్చు జగన్ అధికారంలోకి వచ్చాక అయిదేళ్ళ పాటు బటన్ నొక్కుతూ లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలలో నగదు బదిలీని డైరెక్ట్ గా చేసేవారు.

దాంతో అయిదేళ్ల కాలంలో సగటున ప్రతీ లబ్దిదారుని ఖాతాలో లక్ష నుంచి రెండు మూడు లక్షల దాకా పడ్డాయి. ఆ విధంగా వారిని పండుగలు పబ్బాలు అన్నీ దివ్యంగా సాగిపోయయి. ఇపుడు పెద్ద పండుగగా సంక్రాంతి వస్తోంది. అయినా కానీ బ్యాక్ ఖాతాలో ఒక్క రూపాయి కూడా పడలేదని లబ్దిదారులు అంటున్నారు. ఇటీవల జనాలలోకి వస్తున్న కూటమి ప్రజా ప్రతినిధులను కూడా వారు ఇదే విషయం మీద నిలదీస్తున్నారు. ఏడు నెలలలోనే గ్రామీణ ప్రాంతాలలో ఈ రకమైన పరిస్థితి ఉంది. మరి రానున్న రోజులలో ఎలా ఉంటుందో అన్న చర్చ కూడా ఉంది. ఉచిత పథకాలు ప్లస్ అభివృద్ధి అంటే సాధ్యం కాదు. జగన్ ఉచిత పథకాలు అమలు చేసి అభివృద్ధి మరచారు. దాంతో ఉన్నత వర్గాలు మధ్యతరగతి వర్గాలు ఆయన పాలన మీద పూర్తి వ్యతిరేకతను పెంచుకున్నాయి. ఇక దిగువ వర్గాలు కూటమికి ఎందుకు ఓటు వేశాయి అంటే ఉచిత పథకాలను రెట్టింపు ఇస్తారని ఆశపడి అని విశ్లేషణలు ఉన్నాయి. మరి ఈ ఉచితాలు అమలు చేయకుండా అభివృద్ధి అజెండాతో 2029 ఎన్నికలకు టీడీపీ వెళ్తే ఉన్నత మధ్యతరగతి వర్గాల ఓట్లు దండీగా పడవచ్చేమో కానీ రూరల్ సెక్టార్ నుంచి పేద వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ ఉండదన్న చర్చ కూడా ఉంది. ఎక్కువ సంఖ్యలో ఈ వర్గాలే ఉంటాయి కాబట్టి ఏదో విధంగా కూటమి సర్కార్ సర్దుబాటు చేసుకుని సంక్షేమం కూడా చూడాల్సిన అవసరం ఉంది అని అంటున్నారు. ఇక 2004 నాటికి చంద్రబాబు హైదరాబాద్ సహా కీలక ప్రాంతాలలో అభివృద్ధి చేశారు. పాలనను గాడిన పెట్టారు. ప్రభుత్వ కార్యాలయాలలో చక్కగా అన్ని పనులూ జరిగేలా చూసారు కానీ ఎందుకు ఓడారూ అంటే సంక్షేమంలో తేడా కొట్టబట్టే అన్నది ఒకటి ఉంది. మరి ఆ ట్రాక్ రికార్డుని చూసి అయినా చక్కదిద్దుకుంటారా అన్నదే ప్రశ్నగా ఉంది.

# చంద్రబాబూ.. విజన్ అంటే అప్పులేనా?

- మొదటి పేజీ తరువాయి

మరి ఈ అప్పులపై ఎలా స్పందిస్తారు?.

**ప్రభుత్వ గ్యారెంటీ రుణాలు:**

అదే కాకుండా ప్రభుత్వ గ్యారెంటీతో ఈనెల 20న ఏపీ మార్క్‌ఫెడ్, ఎన్సీడీసీ ద్వారా రూ.1000 కోట్లు, అదే మార్క్‌ఫెడ్ అదే ఎన్సీడీసీ ద్వారా ఈనెల 26న మరో రూ.1800 కోట్లు, జూలై 19న రూ.3200 కోట్లతో పాటు, వివిధ బ్యాంకుల నుంచి పౌర సరఫరాల సంస్థ పేరుతో జూన్ 28న రూ.2 వేల కోట్ల అప్పు చేయగా, ఇప్పుడు ఏపీ ఎండీసీ ద్వారా మరో రూ.5 వేల కోట్లు.. అన్నీ కలిపి రూ.13 వేల కోట్ల అప్పు చేశారు.

**రాజధాని కోసం రూ.31 వేల కోట్ల అప్పు:**

వాటితో పాటు, రాజధాని అమరావతి నిర్మాణం కోసం వరల్డ్ బ్యాంక్ ద్వారా రూ.15 వేల కోట్లు అప్పు తీసుకుంటున్నారు. ఇంకా హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు, జర్మన్ బ్యాంక్ ద్వారా మరో రూ.5 వేల కోట్లు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అంటే అన్నీ కలిపి రాజధాని కోసం రూ.31 వేల కోట్ల అప్పు చేస్తున్నారు.

ఈ మూడు కేటగిరిల్లో కలిపి రాష్ట్ర మొత్తం అప్పు రూ.1,12,750 కోట్లు. అంత తక్కువ వ్యవధిలో ఇంత ఎక్కువ అప్పు చేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా మూడు నెలలు సమయం ఉంది. బడ్జెట్ పక్కన పెడితే గ్యారెంటీలు, నాన్ గ్యారెంటీల ద్వారా ఆఫ్ బడ్జెట్ బారోయింగ్ ఎంత ఉంటుందో ఏప్రిల్‌లో తేలుతుంది. కాగా, బడ్జెట్‌లో ద్రవ్యలోటును రూ.68,742 కోట్లుగా చూపింది.

**మా హయాంలోనే తక్కువ:**

మా ప్రభుత్వం దిగిపోయేనాటికి రాష్ట్ర అప్పు రూ.7,21,918 కోట్లు అని కూటమి ప్రభుత్వం తేల్చింది. అందులో రూ.3,90,247 కోట్లు అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం 2014%-%19 మధ్య చేసిన అప్పు. అంటే మా ప్రభుత్వం చేసిన అప్పు 3 లక్షల కోట్ల చిల్లర మాత్రమే. చంద్రబాబు హయాంలో సగటు అప్పుల శాతం 22.6 కాగా, కోవిడ్ సమయాన్ని కూడా కలుపుకున్నా, మా హయాంలో సగటు అప్పుల శాతం 13.5 మాత్రమే. మరి ఎవరిది విధ్వంస పాలన?.

**విజన్ డాక్యుమెంట్లతో చంద్రబాబు గారడీ:**

తాను సీఎంగా ఉన్న ప్రతిసారి విజన్ డాక్యుమెంట్ల ఆవిష్కరణ ద్వారా తానో పెద్ద విజనరీ అని చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో 1998, 2014లో.. ఇప్పుడు 2024లో. ప్రతిసారీ ఆ డాక్యుమెంట్లకు ఘనమైన పేర్లను, పెద్ద ఎత్తున తన అనుకూల మీడియాతో ప్రచారం చేయించుకోవడం చంద్రబాబుకు అలవాటు. తాజాగా విడుదల చేసిన విజన్%-%2047 డాక్యుమెంట్లో వెల్దీ, హెల్దీ, అండ్ హ్యాపీ ఆంధ్రా అని పేరు పెట్టుకున్నారు. ఈ లక్ష్యాల సాధనకు పది సూత్రాలు, పన్నెండు మార్గాలను అనుసరిస్తామని ప్రకటించుకున్నారు.

అంతకు ముందు 1998లో ప్రకటించిన విజన్%-%2020 డాక్యుమెంట్‌లోనూ 19 గ్రోత్ ఇంజన్లను ప్రస్తావించారు. అలాగే 2014లో ప్రకటించిన సన్ రైజ్ ఆంధ్రా రోలింగ్ ప్లాన్‌లో ఏడు మిషన్లు, అయిదు గ్రిడ్‌లు, అయిదు క్యాంపెయిన్ల ద్వారా లక్ష్యాలను సాధిస్తానని ప్రకటించారు. ఈ మూడు విజన్లకు ముందు 'మనసులో మాట' అనే పుస్తకంలో ఆయన ఆలోచనలను వెల్లడించారు. ఈ ఆలోచనల నుంచే ఈ విజన్లు వచ్చాయి. మరి ఆ విజన్లలో ఏ ఒక్క లక్ష్యాన్ని అయినా సాధించారా? కేవలం తనను తాను గొప్పగా చూపించుకోవడానికే ఈ ప్రచార హంగామా తప్ప, ఇందులో అమలులోకి వచ్చిన అంశాలు ఒక్కటైనా ఉన్నాయా?.

**మ్యానిఫెస్టో బాబుకు చిత్తు కాగితం:**

వాస్తవానికి ఎన్నికల సమయంలో ప్రజల ముందు పెట్టే మేనిఫెస్టోనే ఏ పార్టీకైనా వారి విజన్ అవుతుంది. ప్రజలు కూడా మేనిఫెస్టోను చూసి, విశ్వసనీయతను చూసి ఓటేస్తున్నారు. కానీ చంద్రబాబు మాత్రం తన మేనిఫెస్టోను విజన్‌గా భావించడం లేదు. అందుకే ప్రతిసారీ ఇరవై ఏళ్ళ లక్ష్యాలతో డాక్యుమెంట్లను ప్రకటిస్తున్నారు.

చంద్రబాబు తాజా మ్యానిఫెస్టోలో సూపర్ సిక్స్ హామీలు. దానిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ అని ప్రకటించారు. కూటమి పార్టీలు దీనితో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలకు హామీలు ఇచ్చి వారిని నమ్మించారు. ఇంట్లో కూర్చున్నా కూడా ఈ గ్యారెంటీలు వస్తాయని నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయింది. మరి ఈ మేనిఫెస్టో అమలును ఏం చేస్తున్నారు?.

**ఆ హామీలన్నీ ఏమయ్యాయి?:**

మేనిఫెస్టోలో ప్రకటించినట్లు యువతకు యువగళం%-% ఇరవై లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అని ప్రకటించారు. రాష్ట్రంలో ఎవరికైనా ఇది అమలు చేశారా? తల్లికి వందనం పేరుతో స్కూల్‌కు వెళ్ళే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారు. దీన్నే 'నీకు పదిహేను.. నీకు పదిహేను' అని ప్రచారం చేసుకున్నారు. అన్నదాత%-% సుఖీభవ అన్నారు. రైతులకు ఇరవై వేలు ఇస్తామన్నారు. ఎవరికైనా ఇచ్చారా? దీపం కింద ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్నారు. కానీ వారు అమలు చేసింది పావుదీపం, అంటే ఒక్క సిలెండర్ మాత్రమే ఇచ్చారు. ఆడబిడ్డకు నిధి పేరుతో ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు దీనిపై మాట్లాడే పరిస్థితే లేదు. ఇక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఎవరికైనా ఇది వచ్చిందా? కనీసం ఈ హామీల అమలుకు బడ్జెట్ ఏమైనా కేటాయింపులు చేశారా అంటే అదీ లేదు.

**'సూపర్ సిక్స్' కు ఏదీ కేటాయింపు?:**

తల్లికి వందనం కింద 83 లక్షల మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.12,450 కోట్లు కావాల్సి ఉంది. కానీ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.5386 కోట్లు మాత్రమే. అంటే తల్లికి వందనం ఈ ఏడాది లేనట్టే. ఇంతకు ముందు మా ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద బడికి వెళ్ళే పిల్లలు ఉన్న తల్లికి రూ.15 వేలు ఇచ్చాం. దీపం పథకం కింద 1.49 కోట్ల మంది అర్హులైన వారు ఉన్నారు. దీనికి గానూ రూ.3,955 కోట్లు అవసరం కాగా రూ.895 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే ఒక సిలెండర్‌కే పరిమితం చేశారు. ఆడబిడ్డ నిధి కింద 2,07,29,444 మంది మహిళలకు లబ్ది చేయాల్సి ఉంది. దీనికి గానూ రూ.37,313 కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. అన్నదాత సుఖీభవ కింద 53.53 లక్షల రైతులు ఉండగా వీరికి రూ.10,706 కోట్లు అవసరం. కానీ బడ్జెట్‌లో కేవలం రూ.1000 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే ఈ పథకం కూడా ఈ ఏడాది లేనట్లే. ఉచిత బస్సు ప్రయాణం కింద సుమారుగా రూ.2500 కోట్లు అవసరం ఉంటుంది. దీనికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. యువగళం కింద ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల చొప్పున సుమారు రూ.7,200 కోట్లు అవసరం ఉంటుంది. కానీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. సంక్షేమ పెన్షన్ల పథకాల వయస్సును 60 నుంచి 58 ఏళ్ళకు తగ్గిస్తానన్నారు. దీనికి గానూ రూ.12,900 కోట్లు అవసరం ఉంటుంది. 26,00,087 మందికి ఇది వర్తింప చేయాల్సి ఉంటుంది. దీనిపైనా ఎటువంటి స్పందన లేదు.

**ప్రశ్నిస్తానన్నారు. నోరు మెదపడం లేదు:**

రైతులకు సంబంధించి గతంలో దాదాపు రూ.1200 కోట్లు ఉచితంగా పంటల భీమాకు ప్రభుత్వం చెల్లించేది. దానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఈ వాగ్దానాలు కూటమి పార్టీలు ఇచ్చాయి. ఇదే కూటమిలోని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రశ్నించడానికే పార్టీ పెట్టాను అని చెప్పారు. మరి సూపర్ సిక్స్ హామీలపై ఎందుకు ఆయన నోరు మెదపడం లేదు? ఇదే కూటమిలోని బిజెని ఈ హామీలపై ఏం మాట్లాడటం లేదు. ఈ హామీల ప్రకటన సమయంలోనూ వారు పక్కకు వెళ్లిపోయారు. ఇప్పుడు వారు దీనిపై పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**ఆనాడూ హామీలు విస్మరించిన టీడీపీ:**

ఇంతకు ముందు సన్ రైజ్ విజన్ సమయంలోనూ టీడీపీ మేనిఫెస్టో రిలీజ్ చేసింది. అప్పుడు అన్ని వ్యవసాయ రుణాల మాఫీ అని హామీ ఇచ్చారు. రుణమాఫీకి రూ.87,612 కోట్లు కావాల్సి ఉండగా, కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పేరుతో రైతులకు రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేశారు. అలాగే రైతుల రుణ పరపతిని తగ్గించేశారు. పైగా రుణమాఫీ చేసేశామని చెప్పుకున్నారు. రైతులకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. రూ.11,500 కోట్లు రైతులకు అవసరం ఉండగా, కేవలం రూ.630 కోట్లు మాత్రమే ఇచ్చారు. అంటే ఈ పథకాన్ని నిర్వీర్యం చేశారు. స్వామినాథన్ వ్యవసాయ నివేదికను అమలు చేస్తామని, అలాగే రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ కేవలం రూ.500 కోట్లు మాత్రం అధికారం నుంచి దిగిపోయేప్పుడు నామమాత్రంగా కేటాయించారు. బ్యాంకుల్లో కుదువ పెట్టిన మహిళల బంగారాన్ని ఇంటికి తెప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఒక్కరిదైనా కుదవ పెట్టిన బంగారం ఇంటికి వచ్చిందా? డ్వాక్రా రుణాల మాఫీ అని హామీ ఇచ్చారు. ఆనాటికి రూ.21,500 కోట్లు ఉంటే ఒక్క రూపాయి ఇవ్వలేదు. బెల్ట్ షాప్‌లు రద్దు అన్నారు. విచ్చలవిడిగా బెల్ట్ షాప్‌లు నడిపించారు. ఇంటికి ఒక ఉద్యోగం అన్నారు. కళాశాల విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అన్నారు. గుడిసెలు లేని ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఎన్ని ఇళ్లు కట్టారు?

ఇంకా ప్రతి నియోజకవర్గంలో వృద్ధాశ్రమాలు అన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా రక్షిత మంచినీటి సరఫరా. రెండు రూపాయలకే ఇరవై లీటర్ల మంచినీరు ఇంటింటికి ఇస్తామని అన్నారు. కాపులకు అయిదేళ్ళలో అయిదు వేల కోట్లు ఇస్తామన్నారు. కానీ ఇచ్చింది రూ.1340 కోట్లు మాత్రమే. చేనేత రుణాలు, పవర్ లూమ్స్ రుణాల మాఫీ అన్నారు. ఎన్నికల సమయంలో రూ.111 కోట్లు ఇచ్చారు. నిరుద్యోగ యువతకు రూ.వెయ్యి నుంచి రెండు వేలు నిరుద్యోగ భృతి అన్నారు. పుట్టిన ప్రతి ఆడబిడ్డకు మహాలక్ష్మి అంటూ రూ.25 వేలు ఇస్తామని అన్నారు. ఒక్కరికి కూడా అమలు చేయలేదు. ఈరోజు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.3 వేల కోట్లు బకాయి పడ్డారు. దీంతో ఆ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయడం లేదు. ఫీజు రీయింబర్స్ మెంట్ ఏడాది నుంచి రూ.2800 కోట్లు పెండింగ్ ఉంది.

**మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా చూశాం:**

వైయస్సార్‌సీపీ ఏనాడు పెద్ద పెద్ద వాగ్దానాలు చేయలేదు. 5ఏళ్ల పాలనలో మేనిఫెస్టోనే మాకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని చెప్పాం. అలాగే అమలు చేశాం. మా హయాంలో జగనన్న అమ్మ ఒడి కింద 45 లక్షల మంది తల్లులకు ప్రతి ఏటా రూ.15 వేల చొప్పున ఇచ్చాం. జగనన్న విద్యాదీవెన కింద 27 లక్షల మంది విద్యార్థులకు, వైయస్ఆర్ రైతు భరోసా కింద 53.53 లక్షల మంది రైతులకు, 66 లక్షల మందికి పెన్షన్ కానుక, చేయూత కింద 46.50 లక్షల మంది మహిళలకు ప్రతి ఏటా రూ.75 వేలు, వైయస్ఆర్ ఆసరా కింద 79 వేల మంది అక్కచెల్లెమ్మలకు రూ.27 వేల కోట్ల లబ్ధి చేకూర్చాం.

# పేర్ని నానికి జేసీ ప్రభాకర్ రెడ్డి కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

పేర్ని నాని అరాచకాలు ఇవీ అంటూ ఏకంగా అనంతపురంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు నాని తనను టార్గెట్ చేసి తప్పుడు కేసులు పెట్టించారని జేసీ మండిపడ్డారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలపైనా జేసీ స్పందించారు. పవన్ నాలుగు పెళ్లిళ్లు చేసుకుంటే నీకెందుకు? అని ప్రశ్నించారు. విడాకులు తీసుకున్నాకే చేసుకున్నారని గుర్తుచేశారు. విక్టోరియా ఎవరో తెలుసుకోవాలంటే బందరుకో, మచిలీపట్నానికో పోయి అడుక్కోవాలని సూచించారు. పవన్ కల్యాణ్ మంచోడు కాబట్టి ఊరుకున్నాడు కానీ మనుషులు లేక కాదని హెచ్చరించారు.

"పవన్ కల్యాణ్ ను, నారా చంద్రబాబును ఎన్నెన్ని మాటలు అన్నారు. అసెంబ్లీలో నారా భువనేశ్వరి గురించి చేసిన వ్యాఖ్యలు గుర్తులేవా...? సీఎం చంద్రబాబు మమ్మల్ని ఆపారు. లేదంటే మా కార్యకర్తలు మీ తాట తీసేవారు. మాకు సభ్యత ఉంది కాబట్టే మీ ఆడవాళ్ల గురించి మాట్లాడడం లేదు. నీ బ్యాటరీ వీక్ అయింది చూసుకో" అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు.

గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో పేర్ని నాని రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే జేసీ బ్రదర్స్ కు చెందిన ట్రావెల్స్ బస్సులపై నాటి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. దాంతో జేసీ సోదరులు తమ ట్రాన్స్ పోర్ట్ వ్యాపారాన్ని నిలిపివేసుకోవాల్సి వచ్చింది.

# భార్య పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటు

- మొదటి పేజీ తరువాయి

దొంగ దొంగే అని వ్యాఖ్యానించారు. భార్య పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. భార్య పేరుతో గోడౌన్ ఉంటే, జాగ్రత్తగా ఉండాల్సిన బాధ్యత లేదా? అని నిలదీశారు. బియ్యం దొంగ పేర్ని నాని చట్టం నుంచి తప్పించుకోలేరని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. పేర్ని నాని, ఆయన బినామీలకు చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు. పేర్ని నాని అక్రమాలపై ఈడీ విచారణ జరిపిస్తామని తెలిపారు. పోర్టు సమీపంలోని ప్రజల భూములను లాక్కోవడం వాస్తవం కాదా? అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు.

# భయపడకండి.. మా ప్రాజెక్ట్‌తో ముప్పు లేదు

- మొదటి పేజీ తరువాయి

ఆందోళనలను లేవనెత్తాయి. ఈ డ్యామ్ నిర్మాణం పూర్తయితే నది ప్రవాహంపై చైనాకు నియంత్రణ వస్తుందని, యుద్ధ సమయాల్లో పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేయడానికి అవకాశం ఉంటుందని భారత్ పేర్కొంది. అలాగే, బంగ్లాదేశ్ లో సరిహద్దు ప్రాంతాలను వరదలు ముంచెత్తుతాయని ఆ దేశం ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో ఈ అంశంపై శుక్రవారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. ఈ డ్యామ్ విషయంలో ఎలాంటి భయాందోళనలు పెట్టుకోవద్దని ఆమె సూచించారు.

# నాటి గుంతల రోడ్డే నేడు ఇలా రహదారిగా మారింది

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో ఇంటికో స్విమ్మింగ్ పూల్ ఉందంటూ గతంలో సోషల్ మీడియాలో ఓ ఫొటో వైరల్ గా మారిన విషయం తెలిసిందే. గుంటూరులోని గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడం, వాటిలో వర్షం నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. 2022 జులైలో ఈ రోడ్డుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇది చూసి నెటిజన్లు నాటి వైసీపీ సర్కారుపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ఎద్దేవా చేస్తూ కామెంట్లు పెట్టారు. కాంట్రాక్టర్ కు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం పెండింగ్ లో పెట్టడంతో పనులు ఆగిపోయాయి.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పెండింగ్ బకాయిలు క్లియర్ చేస్తూ నిధులు విడుదల చేసింది. దీంతో గుజ్జనగుండ్ల – పలకలూరు రోడ్డుకు మోక్షం లభించింది. పనులు వేగంగా పూర్తిచేసిన కాంట్రాక్టర్.. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు చక్కగా తయారైంది. ఈ క్రమంలోనే ఈ రోడ్డుకు సంబంధించిన ఫొటోలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వైసీపీ ప్రభుత్వంలో అలా.. కూటమి ప్రభుత్వంలో ఇలా.. అంటూ నాటి గుంతల రోడ్డు, నేటి తారు రోడ్డు ఫొటోలను నెటిజన్లు షేర్ చేస్తున్నారు. మార్పు కళ్ల ముందే కనిపిస్తోందంటూ కామెంట్లు పెడుతున్నారు.

# ఎట్టి పరిస్థితుల్లో ఢిల్లీలో బీజేపీని గెలవనివ్వం

- మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే దేశ రాజధానిలో ఓటర్ల జాబితాను తారుమారు చేయడానికి బీజేపీ 'ఆపరేషన్ లోటస్' ప్రారంభించిందని.. డిసెంబర్ 15వ తేదీ నుండి కమలం పార్టీ ఈ ఆపరేషన్ ప్రారంభించిందని ఆరోపించారు కేజ్రీ. 'నేను పోటీ చేయనున్న న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో డిసెంబర్ 15 నుంచి బీజేపీ ఆపరేషన్ కమలం కొనసాగుతోంది. ఈ 15 రోజుల్లో వారు 5,000 ఓట్లను తొలగించడానికి, 7,500 ఓట్లను చేర్చడానికి దరఖాస్తు చేసుకున్నారు' అని పేర్కొన్నారు. అసెంబ్లీలోని మొత్తం ఓటర్లలో సుమారు 12 శాతం మంది ఓటర్లను తారుమారు చేస్తుంటే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏముందని బీజేపీని ప్రశ్నించారు కేజ్రీవాల్. తప్పుడు పద్ధతుల్లో ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని బీజేపీ కోరుకుంటోందని.. కానీ ఢిల్లీ ప్రజలు దాన్ని జరగనివ్వరని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఉపయోగించిన వ్యూహాలను ఇక్కడ పని చేయవని.. ఢిల్లీలో ఎట్టి పరిస్థితుల్లో బీజేపీని గెలనివ్వబోమని హాట్ కామెంట్స్ చేశారు.

# నా మాతృభాష మరాఠీ... కానీ...!

- మొదటి పేజీ తరువాయి

ద్వారా భాషను నేర్చుకుంటారని తెలిపారు. మాతృభాష ద్వారానే సృజనాత్మకత అలవడతుందని, మాతృభాషతో మమేకం అయి ముందుకు సాగడం వల్ల తెలివితేటలు కూడా పెరుగుతాయని అన్నారు. "నేనీ మాట ఎందుకు చెబుతున్నానంటే... నా మాతృభాష మరాఠీ. ఎప్పుడో 400 ఏళ్ల కిందట మహారాష్ట్రలోని శంభాజీ సంస్థానానికి చెందిన సైనికులు విస్తరణలో భాగంగా తంజావూరు వరకు వలసలు వెళ్లారు. ఆ సమయంలో మా కుటుంబం కూడా మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడే ఆగిపోయింది. నా మాతృభాష మరాఠీ అయినా... నా చిన్నప్పటి నుంచి మా అమ్మ తెలుగులోనే మాట్లాడడంతో నేను కూడా తెలుగు నేర్చుకున్నాను.

నా మాతృభాష మరాఠీ అయినప్పటికీ, నేను మరాఠీ మాట్లాడగలిగినప్పటికీ... నాకు తెలుగే అబ్బింది. ఎందుకంటే... నా ఆలోచన తెలుగులోనే ఉంటుంది. నేను మరాఠీతో పాటు కన్నడ, తమిళం, హిందీ, ఇంగ్లీషు కూడా మాట్లాడగలిగినప్పటికీ... నేను ఆలోచించేది తెలుగులోనే, నా భావ వ్యక్తీకరణ తెలుగులోనే ఉంటుంది. మిగతా భాషల్లో మాట్లాడాలంటే కూడబలుక్కుని మాట్లాడాల్సి ఉంటుంది" అని సత్యకుమార్ వివరించారు.

# రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగనున్న ఈ సమావేశానికి వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు హాజరవుతారని ఆమె తెలిపారు.


# పెన్ పవర్
## ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు





# 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి

**ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన**

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 29:** పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. తాడేపల్లిగూడెంలో టిడిపి కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వనివిధంగా పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. వృద్ధాప్యపు పింఛన్లు నాలుగు వేల రూపాయలకు పెంచామని వికలాంగుల పెన్షన్లు 6000 రూపాయలు ఇస్తున్నామని తెలిపారు. పెన్షన్లు ఇచ్చే రోజుకు సెలవు దినాలు వస్తే ఒకరోజు ముందుగానే వీటిని లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. వాలంటీర్లు లేకపోతే పెన్షన్ల పంపిణీ ఆగిపోతుందని చేసిన సరికాదని తెలిపారు. ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా ఆహారం అందిస్తున్నామని మంత్రి వివరించారు. అమరావతి పోలవరం రెండూ కూడా త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. సంక్రాంతి నాటికి ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నిర్మిస్తామని అన్నారు. గుంతలు లేని రాష్ట్రాన్ని చేయాలని ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. వైసిపి కరెంట్ చార్జీల పెంపుపై పోరుబాట పేరుతో నిరసన వ్యక్తం చేయడానికి ఆయన అభ్యంతర వ్యక్తం చేశారు. అప్పటి నిరసన వ్యక్తం చేసినా పొర్లు దండాలు పెట్టిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు.

# కూలీలతో వెళుతున్న వాహనం బోల్తా





**-జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరు**

**-పెన్ పవర్ పత్రికలో నవంబర్ 9న కథనం ప్రచురణ**

**-అధికారులు స్పందించకపోవడంతో దురదృష్టకర సంఘటన**

**కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 29.** మితిమీరిన వేగం, పరిమితికి మించి వ్యవసాయ కూలీలను తీసుకొని వెళుతున్న వాహనాలపై పెన్ పవర్ నవంబర్ 9న జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని కథనాన్ని ప్రచురించింది.సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో కోంద్రాజుపేట గ్రామ పంచాయితీ,పూసుగూడెం జంక్షన్ వద్ద వ్యవసాయ కూలీలను తీసుకొని వెళుతున్న మిని డిసియం వ్యాన్ శనివారం పల్టీ కొట్టింది.ఆ వ్యాన్ లో సుమారు 30 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం.కూనవరం మండలానికి చెందిన రైతు వద్ద కూలి పనులకు వచ్చారు.పని ముగించుకొని ఇంటికి వెళుతున్న క్రమంలో వ్యాన్ పల్టీ కొట్టడంతో 9 మందికి గాయలైయ్యాయని స్థానికులు తెలిపారు.క్షతగాత్రులను ఆటో సహాయంతో కోతులగుట్ట నందు ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించి చికిత్స అందించారు.ఈ ప్రమాదంలో మురికి చొక్కయ్య తలకు బలమైన గాయం కావడంతో భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్లు పీహెచ్సీ వైద్యుడు వివేక్ నాయక్ తెలిపారు.మిగిలిన వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. పనికి వచ్చిన కూలీలు చింతూరు మండలానికి చెందిన పేగ గ్రామ పంచాయితీ.పేగ,అల్లిగూడెం గ్రామాలకు చెందిన వారని తోటి కూలీలు తెలిపారు.వ్యవసాయ పని ముగించుకొని ఇంటికి వెళుతుండంగా ప్రమాదం జరిగిందని కూలీలు తెలిపారు.చదువుకు దూరమైన 13 సం నుండి 20 సం మధ్య ఉండే పిల్లలు వ్యవసాయ కూలి పనులకు వచ్చిన వారితో పని చేయించుకుంటున్న రైతులు. ఆటో,టాటా మ్యాజిక్, మహేంద్ర బాలోరో ట్రక్కు వాహనాలు స్థాయికి మించి 20,30 మందిని ఎక్కించుకొని కూలీ పనికి తీసుకు వస్తున్న వాహన యజమానులు.ప్రతి సంవత్సరం ఒకటి,రెండు దురదృష్టకర సంఘటనలు జరిగి ప్రాణాలు కోల్పోయిన పట్టించుకునే అధికారి లేక పోవడం గమనార్హం. సంబంధిత అధికారులలో స్పందన లేకపోవడంతో ప్రమాదకర సంఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి సంఘటన పురావతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం



**జిల్లా కలెక్టర్ షణ్మోహన్.**

**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 29** :ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో 30 వ తేదీ, సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



## జనసైనికుడు కొమ్మిశెట్టి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

**మండపేట. పెన్ పవర్.డిసెంబర్ 29:** మండపేట: పట్టణానికి చెందిన జనసైనికుడు కొమ్మిశెట్టి వెంకటేష్ కొన్ని నెలల క్రితం పెద్దాపురం సెంట్రింగ్ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా లక్ష్మీనరసాపురం వద్ద మద్యం మత్తులో ముగ్గురు యువకులు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన తెలిసిందే. అయితే వెంకటేష్ జనసేన పార్టీలో క్రియాశీల సభ్యుడిగా వున్నాడు. కొమ్మిశెట్టి కుటుంబానికి జరిగిన అన్యాయంపై పట్టణ జనసైనికుడు బొమ్మన సతీష్ కుమార్ పార్టీ అధిష్టానంకు తెలియజేశారు. దీంతో రాజానగరం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బాధిత కుటుంబానికి రూ 5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ జనసేన కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే సభ్యత్వ నమోదు చేయించి వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవడానికి కృషి చేసిన సతీష్ ను వారు అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు వుండమట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 29:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఈ నెల 31నే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో పి.జి. రామకృష్ణ తెలిపారు. మండలంలో మొత్తం 3856 మందికి సంబంధించి రూ. కోటి 60 లక్షల నగదును అందిస్తామన్నారు. జనవరి 1న జరగవలసిన పింఛన్ల పంపిణీ డిసెంబర్ 31 నే చేయడం జరుగుతుందని, లబ్ధిదారులు గుర్తించి పింఛన్లు పొందాలని కోరారు.

## జొన్నాడ-మండపేట రోడ్డుపై రయ్..రయ్

**రూ.కోటి 30 లక్షలతో పూర్తయిన మరమ్మతులు.**




**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:** కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ నుంచి మండపేట వరకు అద్వానంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్డును రూ.కోటి 30 లక్షలతో మరమత్తులు జరిగాయి.గత కొంతకాలంగా ఈ రోడ్డు పెద్దపెద్ద గోతులు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండేది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం ఒక సాహసంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మత్తులకు హామీ ఇచ్చింది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతిష్టంగా ఈ రోడ్డు పనులను చేపట్టారు.జొన్నాడ నుంచి గుమ్మలేరు వరకు రూ. 70 లక్షలతో మరమ్మత్తులు పూర్తి చేయగా అక్కడ నుంచి మండపేట వరకు రూ.60 లక్షలతో ఈ పనులు పూర్తి కావచ్చాయి.మొత్తం ఈరోడ్డు పనులు పూర్తి స్తాయిలో జరిగి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది.ఈ రోడ్డుపై ప్రస్తుతం ప్రయాణిస్తున్న వాహన దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఆటో డ్రైవర్లు అంతా నిబంధనలు పాటించాలి





**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 29:** ఆటో డ్రైవర్లు అంతా నిబంధనలు పాటించాలని జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ సూచించారు. ఆదివారం జగ్గంపేట గ్రామ శివారు నగరం ఏగులమ్మ తల్లి గుడి ఎదురుగా జగ్గంపేట శ్రీ సాయి గణేష్ ఆటో యూనియన్ కాకినాడ రోడ్డు కాట్రావులపల్లి స్టాండ్ సమావేశం జరిగింది. యూనియన్ స్థాపికులు కాటే చిన్నబాబు, చీకట్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. దొంగతనాల బారిన పడకుండా ప్రయాణికులను అప్రమత్తం చేయాలన్నారు. ప్రయాణంలో ఎవరిపైనైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం సీఐ, ఎస్ఐలను ఆటో యూనియన్ నాయకులు సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. యూనియన్ సభ్యులకు, డ్రైవర్లకు పోలీస్ నెంబర్ స్టిక్కర్లను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు గొర్రెల రమణ, అధ్యక్షులు మంజేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మల్లవరపు దొరబాబు, కార్యదర్శి బూర్లు సత్తిబాబు, జాయింట్ కార్యదర్శి ఇమ్మెళ్ల గంగాధర్, కోశాధికారి అప్పికొండ వెంకన్న బాబు, సభ్యులు నీతిపూడి చంటి, దుంగా సింహాచలం, వానశెట్టి విజయ్, గింజాల లోవరాజు, బత్తిన వీరబాబు, చేవా చిన్నోడు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రతిరైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



**కొత్తపేట, పెన్ పవర్, డిసెంబర్29:**కొత్తపేట మండలం రైతు సోదరులందరికీ విజ్ఞప్తి భారత ప్రభుత్వం పీఎం కిసాన్ పొందేందుకు భూమి ఉన్న రైతులు అర్హత పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేయించుకోవాలి ఇందులో నమోదు చేసుకోవడం ద్వారా ఒక యూనిక్ ఐడి అనేది క్రియేట్ చేయబడుతుంది. ఆ నెంబర్ ద్వారానే పీఎం కిసాన్ రైతు పథకానికి అర్హత పొందుతారు. అందుచేత భూమి ఉన్న ప్రతి రైతు పీఎం కిసాన్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరుచున్నాము. మీరు మీ ఆధార్ కార్డు తో లింక్ అయిన ఫోన్ నెంబర్,ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్. బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ తీసుకుని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళితే అగ్రికల్చర్ ఆఫీసర్స్ ఫీల్డ్ అసిస్టెంట్లు మీకు నమోదు కార్యక్రమంలో సహకరిస్తారు .కావున భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానంద రావు కోరుచున్నారు .ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంఠం శెట్టి శ్రీనివాసరావు, చోడ పనీడి భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు ,బూత్ కన్వీనర్ మామిడిశెట్టి వెంకటేష్. పినిపే ప్రసాద్ పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయం ప్రారంభం




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 29:**తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ప్రారంభించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి ఇంటి సమీపంలో ఆయన ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం ప్రారంభానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తెలుగుదేశం ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏలూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.డి షరీఫ్, నరసాపురం టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ, నర్సాపురం పార్లమెంటు మీడియా ఇంచార్జి నరిసే సోమేశ్వరరావు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం విజయవంతానికి మోటార్ సైకిల్ ర్యాలీ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 29:**హైందవ శంఖారావం విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పట్నంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జనవరి 5వ తేదీన విజయవాడలో ఈ హైందవ శంఖారావం నిర్వహించనున్నారు. ఈ మేరకు జన సమీకరణ చేస్తున్నారు. పట్నంలో ఉన్న ఆర్ఎస్ఎస్, హిందూ పరిషత్ కార్యకర్తల నాయకులతో సిద్ధం చేయడానికి ఇటీవల సమావేశాన్ని నిర్వహించారు. దీంతో ఇప్పటినుండి ఆర్ఎస్ఎస్ , విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు జన సమీకరణ చేస్తూ ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నారు. ఈ ర్యాలీలో భోగిరెడ్డి ఆదిలక్ష్మి, ఆర్ఎస్ఎస్, విహెచ్పి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పందెం రాయుళ్లు ఆరెస్ట్



**సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్:29**కోడిపందాలు స్థావరంపై దాడి చేయగా ఎస్సై డి. రామ్ కుమార్ ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు, ఆదివారం నాడు సీతానగరం మండలంలో నల్లగొండ గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కోడిపందాలు నిర్వహిస్తున్న వారిలో ఐదు గురు వ్యక్తులనుఅదుపులోకి తీసుకున్నారు, వారి వద్ద మూడు కోళ్లు ఎనిమిది బైకులు రెండు కత్తులను 6700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు, నిందితులపై కేసు నమోదు చేశారు మండలంలో ఎక్కడైనా కోడిపందాలు పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు అట్లు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు,

## మునీశ్వరమ్మ మరణం తీరని లోటు

- చల్లా కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బండారు..



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:**ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా విశేష సేవలు అందించిన చల్లా మునీశ్వరమ్మ(80) మృతి తీరని లోటని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆయన ఆదివారం మండల కేంద్రమైన ఆలమూరులో ఆమె నివాసానికి స్థానిక నేతలతో చేరుకుని ఆమె కుమారులైన ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, చల్లా నానాజీ, చల్లా భూషణములను కలిసి పరామర్శించారు.ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,డిసెంబర్ 29:**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల్లో ఖర్చు చేసి కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్అఫ్ పథకం కొండంత అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడపా ప్రసాద్, వర్తనపల్లి కాశి, రామ్ శెట్టి సురేష్, దార్లంక రాము, పిల్లా రాంబాబు, కర్రి వెంకట్రామ నాయుడు, కేశవభట్ల విజయ్, పైబోయిన వెంకటరామయ్య,నాగు, ముఖేశ్,సత్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలి



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ. 3580 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్ వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నెలలు గడుస్తున్నా, విద్యా దీవెన,వసతి దీవెన లను, (ఎంటిఎఫ్, ఆర్టిఎఫ్) పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తుందని ధ్వజమెత్తారు. ఉన్నత విద్యారంగానికి సంబంధించి జీవో నంబర్ 77 పై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు.కేవలం రియంబర్స్మెంట్ అందకపోవడం వల్ల పది లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని,జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలని అన్నారు . డిసెంబర్ 30న విజయవాడ నగరంలో ధర్నా చౌక్ నందు జరిగే పోరు దీక్షకు విద్యార్థి లోకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సతీశ్, కుమార్, రమణ, రామచంద్ర పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే పితాని

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 29:**చదువుతోపాటు క్రీడల్లో కూడా యువత రాణించాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు.

గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ అధ్యక్షతన ప్రతి ఏడాది టెన్నిస్ బాల్, మెగా క్రికెట్ టోర్నమెంట్ ఇక నిర్వహిస్తున్నారు.

మూడో రోజు మాజీమంత్రి, ఆచంట శాసన సభ్యులు పితాని సత్యనారాయణ ఈ టోర్నమెంట్ను ప్రారంభించారు. యువకులను ప్రోత్సహిస్తూ వారికి ఎమ్మెల్యే పితాని అభినందనలు తెలిపారు. ఈ మెగా టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్లో ఈసారి 55 టీములు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో పద్మనాభుని మురళీమోహన్, ఎరుబండి సతీష్, పసలపూడి రాంబాబు, జోగి వెంకటేశ్వరరావు, శనగన రాంబాబు, ముఖ్య నాయకులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



## జొన్నాడ- మండపేట రోడ్డును పరిశీలించిన రాష్ట్ర చీఫ్ ఇంజనీర్.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

కోనసీమ జిల్లా జొన్నాడ –మండపేట ఆర్ అండ్ బి రోడ్డు రిపేర్ పనులను రాష్ట్ర ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ నయీముల్లా ఆదివారం పరిశీలించారు.రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి రోడ్ల రిపేర్లు జరుగుతున్న నేపథ్యంలో వాటిని పరిశీలించడానికి జిల్లాకు విచ్చేసిన చీఫ్ ఇంజనీర్ నయీముల్లా ఆలమూరు వద్ద రోడ్డును పరిశీలించి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. జొన్నాడ మండపేట రోడ్డు రిపేర్ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈయన వెంట ఆర్ అండ్ బి ఎస్ ఈ కాంతు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము, డిప్యూటీ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

## విద్యలో విద్యాధర్ ఉత్తమ ప్రతిభకు పురస్కారం



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:**ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో జరిగిన ద్వితీయ వార్షికోత్సవంలో జాతీయ స్థాయిలో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్ పరీక్షల నందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండల కేంద్రం ఆలమూరుకు చెందిన యుటిఎఫ్ మండల అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు కుమారుడు శ్రీసాయి విద్యాధర్ ను అసోసియేషన్ నాయకులు ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రము, మెమెంటోతో సత్కరించి, పదివేల రూపాయల నగదు బహుమతిని కూడా అందజేశారని ఆదివారం శ్రీనివాసరావు స్థానిక విలేకరులకు తెలిపారు. అలాగే అసోసియేషన్ విద్యార్థి విద్యాధర్ మరింతగా విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారని యుటిఎఫ్ నేత అద్దరి తెలిపారు.

## హైందవ శంఖారావంకి తరలిరండి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 29:** దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న అన్ని మత ఉద్యోగులను తొలగించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కక్కిరాల అప్పారావు అన్నారు. ఆదివారం హైందవ శంఖారావు బహిరంగ సభకు తరలిరావాలని జీలుగుమిల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు .సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి హిందువులంతా లక్షలాదిగా పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని సూచించారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులలో హిందువులు మాత్రమే ఉంచాలి అని, దేవాలయ ట్రస్ట్ బోర్డులలో రాజకీయ పార్టీలతో ప్రమే ఉండరాదని అన్నారు. దేవాలయాల పరిసరాలలో దుకాణాలు అన్ని హిందువులకు మాత్రమే కేటాయించాలని ,దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. అన్యకాంతం భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హిందువులు కొనకళ్ళ ముత్తయ్య, కక్కిరాల మురళి, సూర్యచంద్ర ,మాతం శెట్టి కిషోర్ బాబు, శ్రీను ,రవి తదితరులు పాల్గొన్నారు.

## పంట చేలోనే మొలకలు వచ్చిన ధాన్యం



**వై రామవరం, పెన్ పవర్, డిసెంబర్ 29:** తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలకొరిగి మొక్కలు మొలిసాయ అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట చేతికి అందే సమయంలో తుఫాను ప్రభావంతో భారీ నష్టం సంభవించిందని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి పంటను కోసుకోలేకపోయామన్నారు. తేలికపాటి వర్షాలు ఈదురుగాలులు తో పంట నేలకొరిగింది అని తెలిపారు. ఎంతో కష్టపడి పండించిన పంట, తుఫాను ప్రభావంతో నష్టపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిచి రంగు మారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

# గడప లోపలే మతం - గడప దాటితే భారతీయులం

### నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ సిపిఎం కరపత్రం ఆవిష్కరణ



**కాకినాడ, పెన్ పవర్ డిసెంబర్ 29:** గడప లోపలే మతం - గడప దాటితే భారతీయులం అంటూ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాన్ని ఆదివారం ఉదయం కచేరిపేట వెంకటేశ్వరకాలనీ కూడలిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి. బేబిరాణి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ విశిష్టత అని తెలిపారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర ఏ మతాన్ని అనుసరించినా మనమంతా భారతీయులమే అన్నారు. దేశ సమైక్యత సమగ్రత, మతసామరస్యం వర్ధిల్లాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ నిలబడాలన్నారు.మతోన్మాదుల ఆగడాలకు అవకాశం ఇవ్వరాదన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అవమానకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలంతా రాజ్యాంగ హక్కుల రక్షణ కొరకు నిలబడాలన్నారు.

సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం వెల్లి విరిసేలా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న పాలకులు ప్రజలు ప్రశ్నించకుండా మతం, ఆరాధన, విశ్వాసాలను చర్చనీయాంశం చేస్తారని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మనమంతా భారతీయులమే అనే భావానికి వన్నె తేవాలన్నారు. సిపిఎం కార్యక్రమాన్ని నగర ప్రజలు ఆదరించాలని కోరుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకట రమణ, దుంపల ప్రసాద్, కె. నాగజ్యోతి,నాగాబత్తుల సూర్యనారాయణలతో పాటు చంద్రమళ్ళ పద్మ, నర్ల ఈశ్వరి, లోవ, కుమారి, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 31న పింఛన్ల పంపిణీ



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, డిసెంబర్ 29:** కూటమి ప్రభుత్వం ఆదేశానుసారం జనవరి నెల సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చి రి బాలరాజు అన్నారు. ఆదివారం బర్రింకలపాడు ఆయన నివాసం వద్ద మాట్లాడుతూ జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరాది కావడంతో డిసెంబర్ 31న పింఛన్ల పంపిణీ కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అదే రోజు పింఛలను పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 108, 104 అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. 108 వాహనాలు 190 కొత్త వాహనాలను కొనేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. 108 డ్రైవర్లకు జీతంతో పాటు అదనంగా నాలుగువేల రూపాయలు ఇచ్చే విధానాన్ని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. పోలవరం నియోజకవర్గంలో సుమారు 23 కోట్ల రూపాయలతో నిర్మించే సిసి రోడ్లు దాదాపుగా పూర్తికావస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. రానున్న రోజులలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు.

## అనపాల సేవలు అభినందనీయం

సన్మానం చేసిన పాస్టర్ కే రవి జయంత్




**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 29 :** సామాజిక వేత్త అనపాల ఆంజనేయ రెడ్డి సేవలకు గుర్తింపుగా పండూరు గ్రామం లో జాక్సన్ మినిస్ట్రీస్ పెంతుకోస్తు సంఘం పాస్టర్ కే. రవి జయంతి, సంఘ పెద్దల చేతుల మీదుగా ఘన సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా జాక్సన్ మినిస్ట్రీస్ సంఘ కాపరి పాస్టర్ కే రవి జయంతి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా సామాజిక సేవ చేస్తూ చిన్న వ్యాపారం నిర్వహించుకుంటూ వచ్చిన లాభంలో సగానికి పైగా సామాజి సేవకు ఉపయోగిస్తూ ఎంతోమంది అనాధ శరణాలయాలకు, ఆశ్రమాలకు, వృద్ధులకు పిల్లలకు తన సహాయ సహకారాలు అందిస్తూ సేవలో ఉంటూ కాకినాడ రూరల్ రమణయ్యపేట భవాని కాస్టింగ్ సెంటర్ వద్ద రోడ్డుపై ప్రయాణాలకు నిత్యం దాహం తీర్చే విధంగా నీటి సదుపాయం ఏర్పాటు చేశారు అలాగే ప్రతి సంవత్సరం క్రిస్మస్ సందర్భంగా వృద్ధులకు, చీరలు దుప్పట్లు పంపిణీ చేసేవారు అలాగే ఈరోజు క్రిస్మస్ పురస్కరించుకొని సండే స్కూల్ పిల్లలు 30 మంది కి ఈరోజు ఆయన చేతుల మీదుగా వాటర్ బాటిల్స్ ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా దేవుని కృప ఎల్లవేళలా ఆయన మీద ఉండాలని తెలిపారు.

## శ్రీసాయి రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 29 :** సాయిరాఘవేంద్ర మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ అనుబంధంగా ఉన్న శ్రీసాయి రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఆదివారం స్థానిక గాంధీనగర్ ఒంటిమామిడి సెంటర్ వద్ద గల సాయి రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ అధినేత డాక్టర్ కొండమూరి సత్యనారాయణ సౌజన్యంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే తనయుడు వనమాడి మోహన్ వర్మ హాజరై డాక్టర్ కొండమూరి సత్యనారాయణ సామాజిక సేవలను అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ కొండమూరి సత్యనారాయణ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సాయి రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాలకు తమ వంతు సాయం అందించ్చాలానే లక్ష్యంతో తమవంతు బాధ్యత గా భావించి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. తాము చేపట్టిన ఉచిత వైద్య శిభిరానికి సుమారు 300 మంది కాకినాడ సిటీ వివిధ ప్రాంతాల నుండి హాజరై పేర్లు నమోదు చేసుకున్న వారికి ఉచితంగా పరిక్షించి అవసరమైన వైద్య పరిక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ ఉచిత వైద్య శీబిరంలో కొన్ని కీలకమైన రోగాలతో బాధపడుతున్న రోగులను గుర్తించడం జరిగిందని వారికి మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి సీఫార్సు కోసం ఎమ్మెల్యే కొండబాబు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.అలాగే బొన్మ్యారో ట్రాన్స్ ప్లాంట్ అవసరం కలిగిన కేసును వైజాగ్ లో ఉన్న ప్రముఖ వైద్యులైన తన స్నేహితుడు సహకారం కోరడం జరిగిందని తెలిపారు.సాయి రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి ఎపుడు ప్రజలకు సేవానిరతి కలిగిన సేవలు అందిస్తూ అందరి అభిమానం చూరగొందని డాక్టర్ కొండమూరి సత్యనారాయణ తెలిపారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు




**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 29 :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కాకినాడ ఎన్టీఆర్ బీచ్ లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదివారం సేవా కార్యక్రమాలలో భాగంగా కాకినాడలో గల ఎన్టీఆర్ బీచ్ లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛ సంకల్ప భావంతో" స్వచ్ఛతాహి సేవ" కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని అన్నారు.విద్యార్థులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులు కాకినాడ ఎన్టీఆర్ బీచ్ లో "స్వచ్ఛభారత్" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన రాజమహేంద్రవరం (సి ఓ ఎఫ్) కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బి ఎన్ ఎన్ మూర్తి ఐ ఎఫ్ ఎస్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న వంద మంది ఆదిత్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు రెండు వారాలకు ఒకసారి అయినా సముద్ర తీర ప్రాంతాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఆవరణ వ్యవస్థను రక్షించాలని తెలిపారు.తదుపరి విద్యార్థులు బృందాలుగా విడిపోయి జలచరాలకు ఇబ్బంది కలిగించే ప్లాస్టిక్ స్పూన్ లను, వలముక్కలను,ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి చెత్తబుట్టలో వేశారు. బీచ్ కు వచ్చిన సందర్శకులకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,క్యాంపస్ ఇంచార్జ్ మూర్తి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ ఎస్ ఆర్ వరప్రసాద్, శ్రీ దీప్తి, సెక్షన్ ఆఫీసర్ నాగార్జున, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు

టి తేజేశ్వరరావు,గౌరీ ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన,వక్తృత్వ పోటీలు



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 29 :** స్వామి వివేకానంద యువజన ఉత్సవాలలో భాగంగా స్థానిక రంగరాయ వైద్య కళాశాల డిజిటల్ గ్రంథాలయం లో కాకినాడ ఎన్.ఎం.ఓ (నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు చిత్రలేఖనం,వ్యాసరచన,వక్తృత్వ

పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిరేతలుగా

డా యు రామకృష్ణ, డా ప్రమోదిని ,

డా నర్సింగ్ డా ప్రసోబ్, డా అద్దాల సత్యనారాయణ డా హర్ష ,డాక్టర్ సమంత్ వ్యవహరించారు.

మొత్తం 63 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.ఈ పోటీలలో భాగంగా

స్నేహలత ఆలపించిన దేశభక్తి గీతం అందరినీ మంత్రముగ్దులను చేసింది.అచ్యుత్ వీర్ గీసిన వివేకానంద చిత్రానికి పలువురి అభినందనలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలలో గుమ్మిలేరు హ్యాట్రిక్ విజయాలు.




తూర్పుగోదావరి జిల్లా వడిసిలేరులో జరిగిన పోటీలలో ప్రథమ తృతీయ స్థానాలు

**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:** తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిసిలేరు గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు కు చెందిన కోరా వీరభద్రరావు ఎడ్ల జతలు పలు విభాగాలను బహుమతులు సాధించాయి. వడిసిలేరులో ఆదివారం గన్ని సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలలో గుమ్మిలేరు రైతు కోరా వీరభద్రరావు కు చెందిన ఎడ్లకు పరుగు పోటీలలో వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయాలు సాధించాయి. కోరా వీరభద్రరావు కు చెందిన ఎడ్ల జతలు సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానం,తృతీయ స్థానాలు సాధించాయి. ప్రథమ బహుమతిగా బుల్లెట్ 350 సిసి, తృతీయ బహుమతిగా హెూండాషైన్ బహుమతులుగా అందించారు. అలాగే జూనియర్స్ విభాగంలో ద్వితీయస్థానం సాధించారు. బహుమతులను గన్ని సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కూటమి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చియ్య చౌదరి,రఘురామ కృష్ణంరాజు, బత్తుల బలరామకృష్ణ,ఆదిరెడ్డి వాసు,మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,మాజీ ఎంపీ మార్గాని భరత్, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి,గన్ని కృష్ణ తదితరులు బహుమతులను అందజేశారు. రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటాల్లో విజయం సాధించిన కోరా వీరభద్రరావును పలువురు అభినందించారు.

## ఏలేశ్వరం మండల రూరల్ బిజెపి అధ్యక్షునిగా నీలి సురేష్.



**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 29:** ఏలేశ్వరం మండల రూరల్ బిజెపి అధ్యక్షునిగా నీలి సురేష్ ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు ఇంటి వద్ద షిరిడి నగర్ బిజెపి కార్యాలయంలో ఏలేశ్వరం మండల రూరల్ అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా ఇద్దరు అభ్యర్థులు అధ్యక్ష స్థానానికి నిలబడడం జరిగింది. ఇద్దరు అభ్యర్థులలో నీలి సురేష్, గరికి నాగు నామినేషన్ దాఖలు చేశారు. అయితే చివర్లో గరికి నాగు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో నీలి సురేష్ ను ఏలేశ్వరం రూరల్ మండలం అధ్యక్షునిగా ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఏలేశ్వరం రూరల్ రిటర్నింగ్ ఆఫీసర్ ఊటా వీరబాబు, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ కామినేని జయశ్రీ , ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ మట్టా మంగరాజు పాల్గొని ఎన్నిక ప్రక్రియను పరిశీలించారు. అధ్యక్షుడు నీలి సురేష్ కు ధ్రువీకరణ పత్రం ఊటా వీరబాబు ఇచ్చి అధ్యక్షునిగా నీలి సురేష్ ను నియమించడం జరిగిందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు , ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు పైలా సుభాష్ చంద్రబోస్, ఏలేశ్వరం టౌన్ అధ్యక్షుడు పైల అయ్యప్ప, కూరాకుల రాజా, పతివాడ వేంకటేశ్వర రావు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ సంఘం ఉపాధ్యక్షుడిగా వంటిపల్లి పాపారావు ఏకగ్రీవం.





**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 29:** ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ మురళీకృష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు,కొత్తపేట నియోజకవర్గ కమ్మ సంఘం గౌరవ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ సంఘం ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాకినాడ శ్రీమతి కంటిపూడి సుబ్బాయమ్మ కమ్మ మహాజన సంఘం కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం సర్వసభ్య సమావేశంలో పాపారావు ను ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంతో పాటు జిల్లాలో కమ్మ సంఘం అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తున్న పాపారావును ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పాపారావును ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామ కమ్మ సంఘం నాయకులు శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో నెక్కంటి వెంకట్రాయుడు(బుజ్జి), నామాల రుద్రయ్య చౌదరి,నామాల వెంకటేష్,గొడవర్తి రాంబాబు,గన్ని గణపతి, గారపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

## పోలవరం ప్రాజెక్టుకు భారీ సామాగ్రి తరలిస్తున్న లారీ బోల్తా...

**దేవీపట్నం,పెన్ పవర్,డిసెంబర్,29:** దేవీపట్నం మండలం పాత అంగులూరు గ్రామ సమీపంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన లారీ బోల్తా పడింది. లారీలో భారీ యంత్రాలను తరలిస్తుండగా ఈ సంఘటన జరిగిందని అక్కడ సిబ్బంది తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన పనులు జరుగుతున్న ప్రదేశాలలో లారీలలో వివిధ రకాల భారీ యంత్రాలను తరలించడం సర్వసాధారణం. ఇటువంటి సందర్భాల్లో కొన్నిసార్లు లారీలు అదుపుతప్పి బోల్తా కొట్టడం జరుగుతుంది. ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. భారీ క్రేన్ల సహాయంతో బోల్తా పడిన లారీని, యంత్రాన్ని యధావిధిగా సరి చేశారు. ఇక్కడ ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. లారీలో భారీ యంత్రాలను తరలించే సమయంలో అక్కడ సిబ్బంది అటువైపు ప్రయాణించే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# హైందవ శంఖారావం కు తరలిరండి



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 29:** జనవరి 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందూ బంధువులందరూ తరలిరావాలని వనవాసి కళ్యాణ ఆశ్రమం జిల్లా ప్రముఖ్ ఎం శ్రీను ,ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ ప్రసాద్ పిలుపునిచ్చారు ఆదివారం పాత గంగవరం రామాలయం వద్ద హిందూ బంధువులతో సమావేశం నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణకు, హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. వచ్చేనెల ఐదవ తేదీ జరిగే హైందవ శంఖారావం కార్యక్రమంకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసి హిందూ బంధువుల బలాన్ని చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కే చిన్నారావు, రామాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మరిడమ్మకు బంగారు హారం బహూకరణ



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** పెద్దాపురం పట్టణంలో కొలువైన మరిడమ్మ అమ్మవారికి దాతలు బంగారు హారం బహుకరించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. పెద్దాపురం పట్టణానికి చెందిన పడాల దుర్గారావు, లింగం సాయిచరణ్ లు 16.30 గ్రాముల బంగారు హారాన్ని అసిస్టెంట్ కమీషనర్ కు అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు, దేవస్థానం అర్చకులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం ప్రసాదాలను వారికి అందజేశారు.

## వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో కొలువైన శ్రీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో నందీశ్వరునికి పలు పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పుష్పాలంకరణ, పంచహారతులు, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు ఆరాధ్యుల చిరంజీవిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలను అధిక సంఖ్యలో భక్తులు హాజరై వీక్షించి తరించారు.

## సాంప్రదాయ రీతిలో వేడుకలు జరుపుకోవాలని - సిఐ శ్రీనివాస్



**గోపాలపురం,పెన్ పవర్, డిసెంబర్ 29:**నూతన సంవత్సర వేడుకలను సాంప్రదాయ బద్ధమైన రీతిలో అంతా జరుపుకోవాలని నల్లజర్ల సిఐ నక్క శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ యువకులు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొలగించి పెద్ద పెద్ద శబ్దాలు చేసుకుంటూ వాహనాల నడిపి ఎదుటివారికి ఇబ్బంది కలిగిస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మహిళలు ఇంటి ముంగిట ముగ్గులు వేసే సమయంలో పోకిరి చేష్టలు ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే డిసెంబర్ 31వ తేదీ రాత్రి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన,అశ్లీల నృత్యాలు వేసిన చర్యలు తప్పవని అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఒక్క ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలి అన్నారు. యువత వ్యసనాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు ఫలితాలు. ఆరోజు రాత్రి ఎవ్వరు ఈ కార్యక్రమాలు చేపట్టిన 6 గంటల నుండి పదిన్నర గంటల వరకు మాత్రమే చేసుకోవాలని నిబంధనలను ఉల్లంఘించవద్దు అన్నారు. బాణాసంచా కాలుపులతో ఎదుటివారిని ఇబ్బంది పెట్టవద్దు అని ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా నూతన సంవత్సర వేడుకలను ఆస్వాదించమని కోరారు.

## నూతన సంవత్సరం రోజు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు-ఎస్పీ నరసింహ కిషోర్

**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 29:**ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ రాత్రి ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ముగింపు, వచ్చే ఏడాది నూతన సంవత్సరం పురస్కరించుకొని ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మరికొన్ని రోజుల్లో నూతన సంవత్సరం వస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి హెూటల్లు,బ్రాందీ షాపులో, బార్ అండ్ రెస్టారెంట్లో నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినా సమయం వరకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. అనుమతులను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈ ఈవెంట్ల నిర్వహించే స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అశ్లీల నృత్యాలు లేకుండా చూడాలన్నారు. మత్తు పానీయాలు వాడితే తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. అలాగే ఆరోజు రాత్రి మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిస్తామని అన్నారు. పదివేల రూపాయలు జరిమానా లేదా ఆరు నెలల జయదేవ శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అలాగే మహిళలను ఇబ్బందులు ఉంటే వెంటనే మహిళా రక్షకు టీమ్లకు సమాచారాన్ని అందించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్ లేకున్నా పెద్దపెద్ద ధ్వనులు చేసుకుంటూ తిరుగుతున్న, మితిమీరిన వేగంతో బండులను నడిపిన వాహనాలు సీజ్ చేసి డ్రైవింగ్ లైసెన్స్ లను మూడు నెలలు లేదా అంతకంటే ఎక్కువ రద్దు చేయడం జరుగుతుందని ఎస్పి అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 29:** విధులను ముగించుకుని బైక్ మీద తన స్నేహితుడితో కలిసి ఇంటికి వెళుతున్న యువకుడిని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ముమ్మిడివరం గ్రామానికి చెందిన గ్రంధి షణ్ముఖ వీర వెంకటరమణ, వయస్సు 17 సం,పులిదిండి ఇసుక ర్యాంపు లో సూపర్ వైజర్ గా విధులను నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి విధులను ముగించుకొని, పులిదిండి నుండి ముమ్మిడివరం తన స్నేహితుడు సత్యనారాయణతో మోటార్ సైకిల్ పై వెళుతుండగా లొల్ల గ్రామ సమీపంలో ట్రాక్టర్ బైకును ఢీకొట్టడంతో ఇరువురికి బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం షణ్ముఖ వీర వెంకటరమణ రాజమండ్రి కిమ్స్ హాస్పటల్లో జాయిన్ చేసి చికిత్స అందించగా ఆదివారం ఉదయం సుమారు ఐదు గంటలకి మృతి చెందినట్లు షణ్ముఖ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్రేయపురం ఎస్సై ఎస్ రాము తెలిపారు.

## ఏజెన్సీ ప్రాంతం నుండి జెసాప్ ఉభయ గోదావరి జిల్లా నుండి ఉపాధ్యక్షులుగా వినయ్ ప్రసాద్



**కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 29.**జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జెసాప్ గౌరవ అధ్యక్షులుగా డా. శివన్నారాయణ రెడ్డి,గౌరవ సలహాదారులుగా భమిడి పాటి దత్తు,మంగా వెంకట శివరామకృష్ణలను ఎంపిక చేశారు.జిల్లా అధ్యక్షుడిగా మట్టపర్తి శ్రీనివాస్,విలీన మండలాలైన కూనవరం నుండి ఉపాధ్యక్షులుగా 10 టీవీ వినయ్ ప్రసాద్,మంతెన శ్రీనివాస్ వర్మ కార్యదర్శిగా, దొరబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె వి సత్యనారా యణ,జాయింట్ సెక్రెటరీగా ఎస్ వి ఎల్ రెడ్డి,ఐ శ్రీనుబాబు, కోశాధికారిగా బి.వెంకట్ లు ఎన్నికయ్యారు.ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా కే.ధర్మరాజు, సుబ్రహ్మణ్యం(సుబ్బు), ఫిరోజ్,డివి కిరణ్, అచ్యుత్, వినయ్,కె రాంబాబు తదితరులు ఎంపికయ్యారుఉమ్మడి జిల్లాలోని కాకినాడ, రామచంద్రపురం,రాజమండ్రి,కోనసీమ,ఏజెన్సీ ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం ఉండేలా కమిటీ ఎంపికైంది.

## నాణ్యత తో నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి.

### ద్వారపూడిలో పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ.



**మండపేట.పెన్ పవర్.డిసెంబర్ 29:**ద్వారపూడి లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ ను ఆయన ఆదేశించారు.మండపేట మండలం, ద్వారపూడి గ్రామంలో డైవర్ కాలనీలో చేపట్టిన సి.సి రోడ్లు, డ్రైన్ పనులను పరిశీలించారు. పంచాయితీ వద్ద చేపట్టిన కమ్యూనిటీ హాల్ పనులను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండపేట మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి, గ్రామశాఖ అధ్యక్షులు సత్తి సత్యనారాయణ, అడబాల బుల్లబ్బు, తానంకి చంద్రశేఖర్, గోణం పుల్లయ్య, చేకూరి రమేష్ రాజు, తొర్లపాటి లాజర్, తదితర్లు పాల్గొన్నారు.

## ఆప్తా ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్ షిప్ లు పంపిణీ





**అమలాపురం రూరల్, పెన్ పవర్,డిసెంబర్,29:**అమలాపురం లో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) స్టూడెంట్ స్కాలర్షిప్ ప్రోగ్రాం ఆదివారం అమలాపురం కాపు కళ్యాణ మండపంలో ఆప్తా అమెరికా అధ్యక్షులు ముద్రగడ త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు నాలుగు వందల మంది విద్యార్థినీ, విద్యార్థులకు 2.50 కోట్లకు పైగా స్కాలర్షిప్ అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కలెక్టర్ వి.లక్ష్మీ కాంతం ఐఏఎస్, అమెరికా నుంచి ఆప్తా ప్రతినిధులు గూఢపాటి గోపాల్,భోగాటి రెడ్డీస్,సప్తగిరీస్, మంచిగంటి శ్రీ లక్ష్మీ దీప్తి తదితరులు విచ్చేయగా వారికి ముందుగా సమావేశానికి నల్లా పవన్ కుమార్ గారు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆప్తా ప్రతినిధులు మాట్లాడుతూ ఆప్తా స్టూడెంట్స్ స్కాలర్షిప్ తో పాటు, వ్యాపారస్తులకు సమావేశాలు నిర్వహించడం, రైతులకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయుటకు సమావేశాలు ఏర్పాటు చేయటం, మహిళా సాధికారిత కోసం కృషి చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం ఇలా ఎన్నో రకాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈరోజు ఇచ్చే స్కాలర్ షిప్ లు సహాయం కాదని ప్రోత్సాహం అని అన్నారు. అతిథులు మాట్లాడుతూ ఆప్తా చేస్తున్న కార్యక్రమాలు, జాతి అభ్యున్నతి కోసం చేస్తున్న కృషి అభినందీయమన్నారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు డైరెక్టర్ పురుషోత్తమ నాయుడు, చెన్నైకు చెందిన అరిగెల తమ్మయ్య నాయుడు, కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా విష్ణుమూర్తి, తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ అల్లాడ సోంబాబు, నక్క సూర్యచంద్రరావు,పేరాబత్తుల రాజశేఖర్,కల్వకొలను తాతాజీ, అధికారి జయలక్ష్మి ,ఏడిద శ్రీను,అశెట్టి ఆదిబాబు,బొర్రా వెంకటేశ్వరావు,నల్లా స్వామి,దున్నాల దుర్గ ,విద్యార్థులు,విద్యార్థుల తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్, డిసెంబర్ 29**
రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కొనియాడారు. తాడేపల్లిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మద్దిపాటి మాట్లాడుతూ పార్టీకి నాయకులు,కార్యకర్తలు వెన్నెముక అన్నారు. టిడిపిలో కష్టపడి పని చేసే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మద్దిపాటికి స్వామి వారి యొక్క చిత్రపటాన్ని నియోజకవర్గ ముఖ్య నాయకులు వలవల బాబ్జి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎండి షరీఫ్, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఉండి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మంతెన రామరాజు తదితర నాయకులు హాజరయ్యారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 29:** పెద్దాపురం పట్టణ పరిధిలోని స్థానిక రామారావుపేటలో గల వైభవ్ ఎన్ క్లేవ్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. 1993-98 సంవత్సరంలో స్థానిక మహారాణీ కళాశాలలో డిగ్రీ చదివి సుమారు 25 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఈ రజతోత్సవ వేడుకల్లో కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. నాడు కళాశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. వారంతా ఉన్నత విద్యలు అభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా అడుగు పెడుతూనే హెూదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల తరువాత తమకు తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం, ప్రతీ ఒక్కరూ ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుందరపల్లి శివ నాగరాజు, డాక్టర్ దాదాజీ, సూరిబాబు, సత్యం, సుబ్బు, ప్రశాంత, ప్రసన్న, లత బాల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

## అర్చకులు, పురోహితులకు అండగా ఉంటాం

సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి

మిలీనియం స్టార్ కంచర్ల ఉపేంద్ర బాబు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం డిసెంబ ర్ 29** :సమిష్టిగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని ప్రము ఖ సినీ నటుడు, మిలీనియం స్టార్ కంచర్ల ఉపేంద్ర బాబు అన్నారు. బాలభాను పురోహిత మరియు అర్చక సంఘం ఆధ్వర్యంలో ఆదివా రం కంబాలకొండలో నిర్వహించిన వనమహోత్స వంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అర్చకులు పురోహి తులు ఏకతాటిపై పనిచేయాలని సూచించారు. వీరి సంక్షేమం కోసం ఉపకార స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. సర్వేజనా సుఖినోభవంతు అంటూ అందరినీ ఆశీర్వదించే అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు. సినిమాల్లో నటించాలనే ఉత్సాహం ఉన్న యువతీ యువ కుల కోసం తమ సంస్థ ఎస్.ఎస్.ఎల్.సి.ను సంప్రదించాలని కోరారు. అర్చక సంఘం అధ్య క్షులు జ్యోషుల కామేశ్వర శర్మ మాట్లాడుతూ తమ సంఘానికి స్థలం కేటాయించి భవన నిర్మా ణానికి సాయం అందించాల్ని కోరగా సానుకూ లంగా స్పందించారు.అనంతరం యువ హీరోను అర్చక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో బాలభాను అర్చక మరియు పురోహిత సంఘం వ్యవస్థాపకులు పంతుల వెంకటరమణ , మావుడూరు కిషోర్ కుమార్ శర్మ తో పాటు సంఘం కార్యవర్గ సభ్యు లు పాల్గొన్నారు.

## ఏబులం "కుమ్మర వీధి" గ్రామస్తుల నిధులతో రహదారి నిర్మాణం!

అధికారులు స్పందించండి రహదారి నిర్మాణానికి సహకరించండి





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 29** :అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని ఏబులం కుమ్మర వీధి గ్రామానికి ఇప్పటివరకు ఎటువంటి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్తులు ఈ విషయం అధికారుల దృష్టికి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన ఇప్పటివరకు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు సమైక్యంగా ముందుకు వచ్చి తమ గ్రామంలోని ఉన్న అందరూ కలిసి డబ్బులు చందా వేసుకొని పొక్లైనేర్ ఏర్పాటు చేసుకొని రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు.ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఈ గ్రామానికి ఇప్పటివరకు రహదారి సౌకర్యం లేకపోయినా అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం పట్ల మాజీ వార్డ్ మెంబర్ వంతల టీస్ బాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏబులం కుమ్మరి వీధి గ్రామానికి రహదారి నిర్మాణాన్ని బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అమ్మవారి దారకొండలు సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ

- మారుమూల ప్రాంతాలలో సిసి రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత
- ఎంపీపీ బోయిన కుమారి



గూడెం కొత్త వీధి పెన్ పవర్ డిసెంబర్ 29:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని మారుమూల ప్రాంతాలలో సిసి రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని గూడెం కొత్తవీధి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బోయిన కుమారి అన్నారు.గూడెం కొత్తవీధి మండలంలోని అమ్మవారి దారకొండ గ్రామంలో ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సిసి రహదారి కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు సిసి రహదారులు ఏర్పాటు చేయడం వలన రహదారి సౌకర్యం ఏర్పాటు జరుగుతుందని దీనివలన గిరి రైతులు పండించే పంటలు మార్కెట్లో అధిక ధరలకు విక్రయించుకునే అవకాశం కలుగుతుందని ఆమె అన్నారు ప్రతి గ్రామానికి తప్పనిసరిగా సిసి రహదారి ఉండే విధంగా ప్రణాళిక అమలు చేస్తున్నామని అందులో భాగంగా ఇటీవల అన్ని ప్రాంతాలలోనూ చేసి రహదారుల నిర్మాణానికి చొరవ చూపిస్తున్నామన్నారు. స్థానికులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఇప్పుడు మా గ్రామాలలో సిసి రోడ్లు వేయడం జరుగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సత్యవతి,ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు దావీదు,వైస్ సర్పంచ్ ఎం. చంటిబాబు కూటమి నాయకులు పండ చిన్న, గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు, గ్రామ పెద్దలు చిట్టిబాబు,రామారావు, బాలన్న,జంతరంగి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్కినేని శత వసంతాల స్వరాంజలి సభలో ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్.






**చింతూరు పెన్ పవర్ డిసెంబర్ 29**:నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత వసంతాల స్వరాంజలి ఏలూరు కళాశాల ఆడిటోరియంలో కనుల విందుగా జరిగింది. ఘంటసాల స్వరపీఠం ఎస్ ఎం సుభాని వ్యవస్థాపక కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని తొలుత అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జమాఖాన్ మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో నవల నాయకుడిగా ప్రేమ విషాద కథ చిత్రాలకు అభినయ రారాజుగా వెలుగొందిన పద్మ విభూషణ్ నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాలు ఆంధ్రుల హృదయాల్లో నిలిచిపోయాయని అన్నారు. రంగస్థలం నటన నుండి ప్రారంభమైన ఆయన ప్రస్థానం వెండితెరపై ఒక వెలుగు వెలిగారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిబద్ధత నిజాయితీ కి నిలువుటద్దముల నిలిచిన ఒక నటన కౌశల్యుడని అభినందించారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అశేష ఆంధ్ర ప్రజానీకానికి అభిమానిగా చలనచిత్ర రంగంలో చరితాత్రులు అయినారని అన్నారు. పట్టుదల కార్యదీక్షతో ఆయన నటన రంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగి లక్షలాది అభిమానుల కు చేరువ అయ్యారన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా విచ్చేసిన మాజీ శాసన మండలి చైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ఏఎన్ఆర్ అంటే ఎదురులేని నటన అని రంగస్థలం నుండి చిన్నచిన్న వినోద కార్యక్రమాలు ప్రారంభించి అనతి కాలంలోనే ఆంధ్రుల అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు అని అన్నారు. ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా తన కుటుంబాన్ని ఒక క్రమ పద్ధతిలో ఉంచి తాను మితవాదిగా ఉండేవారని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం జమాల్ ఖాన్ను, షరీఫ్, మరియు ఇతర అతిరథ మహారథులను ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి సుభహాని, మైనారిటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి షేక్ మాబు సుభాని, దేవరకొండ కోటేశ్వరరావు, ఆలపాటి నాగేశ్వరరావు, రెడ్డి అప్పలనాయుడు, ఎండి మస్తానమ్మ, గారపాటి సీతారామాంజనేయ చౌదరి లను షాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నూర్ భాషా, షేక్ సుభాన్, షేక్ ఇబ్రహీం, నూర్ భాషా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, కార్యక్రమ నిర్వహణ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

# మానవతా సేవలు మరింత పెంచాలి - రామచంద్ర రెడ్డి

**గోపాలపురం,పెన్ పవర్, డిసెంబర్ 29**:మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ సేవలను సభ్యులు మరింత పెంచాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్ర రెడ్డి కోరారు. సంస్థను విజయ పథంలో నడిపిస్తూ ప్రజలకు విశేష ఎవరు అందిస్తున్న సంస్థ సభ్యులకు అత్యున్నత ప్రతిభా పురస్కారాలను ఆదివారం నల్లజర్లలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రామచంద్ర రెడ్డి మాట్లాడారు. సభ్యులు ఎంతో అంకితభావంతో పనిచేస్తూ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. మీరు చేసే కార్యక్రమాలు ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపాయని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో వ్యవహరిస్తూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సంస్థ జిల్లా చైర్మన్, విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అలాగే గోపాలపురం మండల అధ్యక్షులు సత్య కృష్ణారెడ్డి, తదితరులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల చైర్మన్ గడ్డ రాంబాబు కో చైర్మన్ నెల్లి చంద్రశేఖర్ కోశాధికారి గడ్డ జోగేంద్ర ప్రసాద్ సభ్యులు హేమంత్,కొయ్య నాగరాజు తదితరులు రామచంద్ర రెడ్డిని కలిసి కొద్దిసేపు ముచ్చటించారు.



# సంజ ఉత్సవ్- ఎస్.హెచ్.జి మేళా అద్భుతం,






- విశేష స్పందన, ఒకరోజు పొడిగింపు.
- భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం , డిసెంబర్ 29.** : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో జీవీఎంసీ మరియు మెప్మా ఆధ్వర్యంలో విశాఖ నగరంలో నిర్వహిస్తున్న సంజ ఉత్సవ్- ఎస్. హెచ్. .జి మేళా అద్భుతంగా ఉందని, ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని , ఎస్ ఎస్ జి మహిళల వ్యాపార అభివృద్ధి దిశగా,వారి ఆర్థిక బలోపే తానికి ఈ మేళా ను ఒకరోజు పొడిగించడం జరిగిందని భీమిలి నియోజకవర్గం శాసనస%ు% భ్యులు గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఆదివారం ఆయన జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ మ యూర్ అశోక్, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ బిశెట్టి వసంత కళ్యాణిలతో కలిసి ఎస్ రాజా క్రీడా మైదానంలో జరుగుతున్న ఎస్.హెచ్.జి. మేళా కు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లా డుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో 25 నగరాలలో ఎస్ హెచ్ జి మహిళల తో మేళాలు నిర్వహించాలని ఆదేశించగా రాష్ట్రం లో విజయవాడ విశాఖపట్నం లో సంజ ఉత్స వ్ పేరుతో ఎస్. హెచ్.జి.మేళాలు నిర్వహి %శ్రీ%స్తు న్నాయని, విశాఖపట్నంలో డిసెంబర్ 25 నుండి 29 వరకు నిర్వహిస్తున్న ఈ ఎస్. హెచ్.జి మేళా లో స్వయం సహాయక సంఘ సభ్యులచే త యారు చేయబడిన వస్తు,వస్త్ర, ఆహార ఉత్ప త్తులు 100 స్టాళ్ల ఏర్పాటుతో ఐదు రోజులు పాటు నిర్వహించగా ప్రజల నుండి ఎస్హెచ్ జి మహిళల నుండి విశేష స్పందన ఉన్నందున ఈ మేళా ను ఒక రోజుకు అనగా 30వ తేదీ సోమ వారం వరకు పొడిగిస్తున్నట్టు తెలిపారు. కూట మి ప్రభుత్వం మహిళలను పలోపేతం చేస్తూ వారి అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఆ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల పింఛన్లు, డ్వాక్రా సం ఘాలను బ్యాంకు లింకేజీ, రుణాలు కల్పన, దీపం పథకం ,ఆర్టిసి బస్సులో ఉచితంగా మహిళలకు ప్రయాణం తదితర సంక్షేమాలను మహిళలకు అందిస్తుందని తెలిపారు. విశాఖ నగరంలో ఈరోజు ఈ మేళాకు వచ్చిన స్పందన అద్భుతమని, ఎస్ ఎస్ జి మహిళా సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇటువంటి మేళాలు మరికొన్ని నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కు సూచించారు. విశాఖ నగరం ఐటీ, టూరిజం, ఇన్ఫ్రా ,పారిశ్రామికంగా, సుందర సముద్రతీరంతో అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా భీమిలి అభివృద్ధిపై దృష్టి సారించారని రూరల్ మండలాలను జీవీఎంసీ లో విలీనం చేసేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ కు శాసనసభ్యులు తెలిపారు.అనంతరం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడు తూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో కేవలం ఎస్ ఎస్ జి మహిళల అభ్యున్నతికి వ్యాపార పరంగా వారిని అభివృద్ధిపరిచేందుకు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2024 ఎస్ హెచ్ జి మేళాను ఒక ఉత్సవంలా మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ( జీవీఎంసీ) మరియు ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ( మెప్మా) ఆధ్వర్యంలో విశాఖ నగరంలో గల స్వయం సహాయక సంఘాల సభ్యులచే స్వయంగా తయారుచేసిన వస్తు, వస్త్ర, ఆహార, ఇతర ఉత్పత్తులను ఒకే చోటకు చేర్చి ప్రజలకు 100 స్టాళ్లతో ప్రదర్శిస్తూ అమ్మకం కొరకు ఉంచేలా ఎస్ హెచ్ జి మేళాను నిర్వహించడం జరిగిందన్నారు. ఐదు రోజులపాటు డిసెంబర్ 25 నుండి 29 వరకు నిర్వహిస్తున్న ఈ మేళా కు ప్రజల నుండి ఎస్ఐజి సభ్యుల నుండి వివిధ స్పందన లభిస్తున్నందున ఒకరోజు అనగా 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కమిషనర్ తెలిపా రు. ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త లేదా ఒక ఉద్యోగి తప్పనిసరిగా మహిళలు ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నిర్దేశం చేశారన్నా రు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందు కు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసు కునేలా ఎస్ హెచ్ జి ప్రొఫైల్ యాప్ లో నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. తద్వారా మహిళ లు- ప్రజలకు అమ్మకాలకు, కొనుగోలుకు వ్యాపారం అనుసంధానంగా ఉండేలా ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్ (ఓ ఎన్ డి సి) వేదికను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియకు మెప్మా , జీవీఎంసీ ప్రజలకు అవగాహ న కల్పిస్తున్నారన్నారు. ఈ ఓ ఎన్ డి సి ద్వారా కొనుగోలుదారులకు ఎక్కువ వస్తువులు తక్కు వ రేట్లకు లభించేలా అమ్మకం దారులకు లాభ దాయకంగా ఉండేటట్లుగా ఈ ఓ ఎన్ డి సి వేదిక ఉపయోగపడుతుందన్నారు. మహిళల వ్యాపారానికి పొదుపు చాలా ముఖ్యమని , పొదుపు ద్వారా వ్యాపారానికి మహిళలు పెట్టుబడిగా వినియోగించుకోవాలన్నారు. తద్వారా అందరూ అభివృద్ధి చెందేలా విశాఖ నగరంలో మురికివాడ రహిత జీవీఎంసీని అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజల వినియోగించుకునేలా ఎస్ ఎస్ జి మహిళలు నిరంతర కృషి చేయాలని కమిష నర్ సూచించారు. ఈ మేళాకు ఆద్యంతం యు సి డి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సత్యవేణి, మెప్మా సిబ్బంది ప్రత్యేక కృషి కనబరిచారంటూ వారికి అభినందనలు కమిషనర్ తెలిపారు.అనంతరం జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్, 33 వ వార్డు కార్పొ రేటర్ బీసెట్టి వసంత లక్ష్మి మాట్లాడుతూ విశాఖ నగరంలో ఈ ఎస్ హెచ్ జి మేళా లో ప్రజల స్పందన చూస్తే సంక్రాంతి పండుగలా నగరంలో జరుగుతుందని, నాలుగు రోజుల్లో అత్యధిక వ్యాపారం జరగడం ఆనందదాయకమని, మహిళలు సాధికారతకు ఈ మేళా మహిళలకు ఆర్థిక బలోపేతం గా దోహదపడుతుందని అన్నారు. భీమిలి నియోజకవర్గం శాసనసభ్యు లు గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి సంపత్ కుమార్ జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ దుస్సాలువతో సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరం శాసనస భ్యులు జీవీఎంసీ కమిషనర్ ను సత్కరించి విశేష ప్రతిభ కనబరిచిన ఎస్ ఎస్ జి మహిళల కు ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం యు సి డి పదసంచాలకులు పీఎం సత్యవేణి మాట్లాడుతూ ఈ మేళాను సందర్శించి సహక రించిన ప్రజా ప్రతినిధులకు, జీవీఎంసీ ఉన్నతా ధికారులకు జోనల్ కమిషనర్లకు, ప్రాజెక్ట్ అధికా రులకు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు, ఏపీడీలకు, ముఖ్యంగా ఎస్ .హెచ్.జి మహిళా సభ్యుల కు,ఆర్పి లకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్లు పి ప్రసన్న వాణి ఎంవిడి పణిరామ్ , ప్రాజెక్ట్ అధికారి డి. లక్ష్మి,డిపిఓ కె .కనకమహాలక్ష్మి, ఏపీడీలు, యు సి డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వాలంటీర్లను బలవంతంగా రాజీనామా చేయించిన
# వైసీపీ నాయకులు బాధ్యత వహించాలి

- రాజీనామాలు చేసి మళ్లీ కూటమి ప్రభుత్వంపై నిందలు సరికాదు
- జనసేన పార్టీ అరకు ఎగ్జిక్యూటివ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లే వీర వెంకట్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్29:** గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వాలంటీర్లను బలవంతంగా రాజినామా చేయించిన వైసిపి నాయకులు దానికి బాధ్యత వహించాలని అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్ల వీర వెంకట్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాస్తవానికి వాలంటీర్లు ఉపాధి కోల్పోవడం బాధాకరమైన విషయమే అయినప్పటికీ, కొంతమంది వాలంటీర్లు వైసిపి నాయకుల మాటలు నమ్మి రాజీనామాలు చేశారని, దానికి నైతిక బాధ్యత వహించాల్సింది రాజీనామా చేయించిన వైసిపి నాయకులదేనని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం వాలంటరీ అనే వ్యవస్థను తీసుకుని వచ్చి 5000 రూపాయల జీతం ఇచ్చి వాళ్లకి ప్రభుత్వ ఖజానా నుండి సొమ్మును చెల్లిస్తూ వైసిపి పార్టీ కార్యకర్తలుగా వాడుకొని చివరి నిమిషంలో వాలంటీర్స్ కి భద్రత లేకుండా రెన్యువల్ చేయకుండా వదిలేసిందని వైసిపి పార్టీ కావాలనే ఉద్దేశపూర్వకంగా అలా చేసిందని వీర వెంకట్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు 10,000 రూపాయల వేతనం పెంచుతామని హామీ ఇచ్చిన మాట నిజమే అయినప్పటికీ వైసిపి నాయకులు వాలంటీర్లు అందర్నీ రాజీనామా చేయించి ఎన్నికల ప్రచారాలకు వాడుకున్నారని తెలిపారు. వాలంటీర్లను రెచ్చగొట్టి కూటమి ప్రభుత్వం పై నిందలు మోపటం సరైన పద్ధతి కాదు అని, ఇప్పటి కూటమి ప్రభుత్వం వాలంటీర్ల ఉద్యోగానికి భద్రత కల్పిస్తూ పదివేల రూపాయల వేతనం పెంచుతామని సాక్షాత్తు ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం నిజమే కానీ వైసిపి పార్టీ నాయకులు వాలంటీర్లను బలవంతంగా రాజీనామా చేయించి వాళ్ల పొట్టలు కొట్టి వాలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడటానికి కారణమయ్యారని అన్నారు. వాలంటీర్ల బ్రతుకులు రోడ్డుమీదకు పడేసిన వైసిపి నాయకులు మళ్లీ కూటమి ప్రభుత్వంపై దీక్షలు చేయించటం, నిందలు వేయించటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కచ్చితంగా కూటమి ప్రభుత్వం రాజీనామా చేయని వాలంటీర్లకు ప్రత్యమ్యాయంగా మంచి ఆలోచన చేస్తుందన్న నమ్మకం మాకు ఉంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాజీనామా చేసిన వాలంటీర్లందరికీ ఈ వైసీపీ నాయకులు వాళ్ల కుటుంబాలను ఆదుకోవాలని నెల నెల వాళ్లకు జీతాలు ఇవ్వాలని బలవంతంగా రాజీనామాలు చేయించిన వాలంటీర్లకు వైసిపి నాయకులే బాధ్యత వహించాలని అన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

విశాఖ కే జీ.హెచ్ .సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం డిసెంబర్ 29 :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందు కు కృషి చేస్తున్నామని విశాఖ కే.జీ.హెచ్ సూప రింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. వై ద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతతో మెలిగేలా చూస్తున్నానన్నారు. ఆదివారం ఉద యం కే.జీ.హెచ్ తన కార్యాలయంలో 2024 కు సంబంధించి కేజీహెచ్ సేవలు, అభివృద్ధి పనుల పై మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభు త్వం ఏర్పాటు అయినా తరువాత కేజీహెచ్ ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పిడియాట్రిక్స్, క్యాన్స ర్ చికిత్స కు సూపర్ స్పెషాలిటీ సేవలు అందు బాటులో ఉన్నాయని, ఈ సేవలు ఉచితంగా అందించబడుతున్నాయని పేర్కొన్నారు. సేవా లోపాలను సరిచేసే దిశగా చర్యలు చేపట్టామని, ఎవరైనా సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే 0891-2590102, 0891-2590100 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మేరకు రోగుల సహాయకులకు అవగాహన కల్పిస్తున్నామన్నా రు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న సింగర్ కారుణ్య



**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం సింహాచలంలో ప్రముఖ సింగర్ కారుణ్య స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంద్ర త్రినాధరావు ఆదేశాల మేరకు స్వాగతం పలికారు. ముందుగా కప్ప స్తంభం ఆలింగనం, తదుపరి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

# నియోజకవర్గ అభివృద్దే ప్రధాన ధ్యేయం.టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా





- రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి.

**గాజువాక పెన్ పవర్, డిసెంబర్ 29:**నియోజకవర్గం అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం 76 వ వార్డు కార్పొరేటర్ , జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డైరీ కాలనీ, గోపాల్ రెడ్డి నగర్, రామచంద్ర నగర్, భరత్ నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీలలో రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సాధించామని వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు, అలాగే రోడ్ల నిర్మించేటప్పుడు వీలైనంతవరకు రోడ్ల విస్తీరణ పెంచే విధంగా చర్యలు తీసుకొని రోడ్డు వెడల్పుగా వేయాలని వీటివలన భవిష్యత్తులో ఏటువంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అధికారులకు సూచించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో ఇప్పటికే ఎమ్మెల్యే గామ సహకారంతో చాలావరకు అభివృద్ధి పనులు పూర్తి చేసామని అన్నారు. ఈ వార్డులో ప్రధానంగా నూతన ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో ప్రధాన గెడ్డలు డ్రైనేజీలపై దృష్టి సాధించి భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేవిధంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బాసెట్టి అప్పారావు, తాటికొండ సుదర్శన్, పీత రమణ, ఉగ్ర%శీ%, మంత్రి శంకర నారాయణ, సతీష్, కూన వెంకట్రావు, బొడ్డు సత్యారావు, పిల్లి అప్పారావు, రోహిత్, సోములు, రాజ, రాము, వివిఎస్ఆర్ ప్రసాద్, గెడ్డం రమణ, శివ, సత్తిబాబు, రమేష్, నాయుడు, మూర్తి , విశ్వనాధం, మోహన్, మహిళలు, యువకులు, కూటమి నాయకులు తది తరులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలల్లో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి





- విద్యార్థులపై పటిష్టంగా పర్యవేక్షణ ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,గూడెం కొత్తవీధి,పెన్ పవర్,డిసెంబర్ 29:** బాలికల పాఠశాలల్లో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, విద్యార్థులపై ఉపాధ్యాయులు, అధికారుల పర్యవేక్షణ పటిష్టంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. ఆదివారం ఆయన జి.మాడుగులలో గాంధీనగర్ జిటిడబ్ల్యూఏ బాలికల పాఠశాలను సందర్శించారు. వీటివల కాలంలో పాఠశాలల్లో తరచుగా జరుగుతున్న సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన పాఠశాలల్లో అనేక రకాల మరణాలు, అత్యాచారాలు, అసభ్య పదజాలంతో జరుగుతున్నటువంటి దాడులు,ఇతర అనైతిక సంఘటనలపై విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేయాల్సిన విద్యాసంస్థలలో ఇటువంటి బాధాకరమైన సంఘటనలు జరగటం ఏమిటని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరాలని ఆశతో బడికి పంపిస్తున్నారని, చదువుకునే పిల్లలు భవిష్యత్తు చదువుల వైపు చూడాలి తప్ప చెడు మార్గం వైపు చూడకూడదు అని హితవు పలికారు. కొంతమంది చదువుకునే పిల్లలు భవిష్యత్తు చదువుల వైపు చూడకుండా ఇప్పుడు చెడు మార్గంలో ముందుకు వెళ్తున్నారు. ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరుగుతుంది అని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో ఉన్న పాఠశాలలో తరచూ జరుగుతున్న సంఘటనలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.



# తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా





- విశాఖ టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు

**గోపాలపట్నం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** ప్రజలకు సంక్షేమ అందించిన పార్టీల్లో దేశ చరిత్రలో తెలుగుదేశం పార్టీ అన్ని పార్టీలకి ఆదర్శంగా నిలుస్తుందని, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ టిడిపి అని విశాఖ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు అన్నారు.

జీవీఎంసీ 92వ వార్డు, జనతాకాలనీలో పార్టీ సభ్యత్వం కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నందవరపు సోములు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదుతో కార్యకర్తలతో పాటు ఆ కుటుంబానికి భరోసా, భద్రత, ప్రమాద బీమా రూ.5 లక్షల ఉంటుందని అన్నారు. ఈనెల 30తో సభ్యత్వ కార్యక్రమం ముగుస్తుందని, అందువలన ప్రతి కాలనీలో ప్రతి ఒక్కరు విధిగా సభ్యత్వాన్ని తీసుకోవాలనిన్నారు. వంద రూపాయలతో సభ్యత్వాన్ని అందరూ తీసుకోవచ్చని, ప్రతి ఒక్కరికి లింకు సౌకర్యం ద్వారా సులభతరంగా సభ్యత్వం చేసుకోవచ్చని అన్నారు.

స్థానిక మహిళా మండలి అధ్యక్షురాలు ఎం. విమల, డి శివలక్ష్మి, నారపిన్ని వరలక్ష్మి, ఏ.అరుణకుమారి, ఐ. జ్యోతి ప్రభ, ఎం సింహలక్ష్మి , ఎస్ విజయ ఏ పద్మ వతి తదితరులు మహిళా నాయకులు డ్వాక్రా గ్రూప్ లీడర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పలువురికి లింకు ద్వారా సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించారు.

# వైభవంగా స్వామివారి స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం





**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం సింహాచలంలో అదివారం ఆలయ వైదిక సిబ్బంది ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్రోక్తముగా శ్రీ స్వామివారికి 108 బంగారు సంపెంగలతో అత్యంత వైభవంగా స్వర్ణపుష్పార్చన, జరిపించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు తెలియజేశారు. ఉదయం స్వామివారికి స్వర్ణపుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణపుష్పార్చణ అత్యంత వైభవంగా, సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధీష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణపుష్పార్చన, సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.



# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం



**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 29 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# ఆదివాసీలు బిడ్డలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలి:

ఎస్సై వెంకటేశ్వర్లు .



**చింతపల్లిపెన్ పవర్ డిసెంబరు 29:-** ఆదివాసీలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పెదబరడగ్రామపంచాయతీలో గిరిజనులతో ఆయనసమమేకమయ్యారు.గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశ నం చేసుకుంటున్నారన్నారు. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు గిరిజన ప్రాంతంవైపు చూ పిస్తున్నారన్నారు. గంజాయి వల్ల గిరిజన ప్రాంతానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గిరిజనులు అసాంఘిక కార్యక్రమాల వైపు మొగ్గుచూపుటమే కాదు , సమాజంలో ఒక స్థాయిని చూపించే శక్తి కలవారిని నిరూపణ చాలా సందర్భాల్లో అయిందన్నారు. ఆ దిశగా గిరిజను లు ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు. గిరిజనులు గంజాయి సాగు, రవాణ చేస్తూ పట్టుబడితే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. గంజాయితో పట్టుబడిన వ్యక్తుల ఆస్తులను సైతం జప్తు చేస్తామన్నారు. గిరిజనులు గంజాయి వ్యాపారులకు సహకరించరాదని, సాగు, రవాణను పూర్తిగ విడిచిపెట్టాలనారు. ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా సమీపంలోనున్న పోలీసు స్టేషన్కి వచ్చి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసులు గుర్తించి సంబంధి తశాఖ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

# పూర్వం విద్యార్థులు అపూర్వ కలయిక

**గాజువాక:పెన్ పవర్ డిసెంబర్ 29** :పూర్వ%శీ% విద్యార్థుల అపూర్వ కలయిక ఇస్లాంపేట హై స్కూల్ లో చదువుకున్న 92 టు 93 విద్యార్థులు అపూర్వ కలయిక నెహ్రూ పార్కు వద్ద జరిగినది ముందుగా వచ్చిన వారి అందరిని స్వాగతించుకొని పలకరించుకొని గెట్ టు గెదర్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా కేక్ కటింగ్ చేసుకుని ఒకరునోఒకరు తినిపించుకుని అందరూ పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని పలకరించుకొని అందరూ ఏం చేస్తున్నారు ఏం చేయబోతున్నారు అని అనుకొని ఈ 92 టు 93 బ్యాచిలో ఉన్నవాళ్లే కే కాకుండా ఎవరికైనా ఏదైనా ఆపద వచ్చింది అంటే మనం ముందుండి సహాయ సహకారాలు అందించాలని మాట్లాడుకోవడం జరిగినది పుర్వం స్టూడెంట్స్ అందరూ ఆటపాటలతో సరదాగా గడిపి మరలా తిరిగి ఎవరి ఇ%శీ%టికి వారు చేరుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో 92 టు 93 లో ఇస్లాంపేట హై స్కూల్ లో చదువుకున్న విద్యార్థులందరూ పాల్గొనడం జరిగినది



## నేడు రెవెన్యూ సదస్సు లో పాల్గొననున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల.

**పరవాడ ( పెన్ పవర్) డిసెంబర్ 29:** పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోమవారం మేజర్ పంచాయతీ పరవాడ గ్రామంలోని నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులో పాల్గొంటారని పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయం ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.. ఉదయం 10 గంటలకు రెవెన్యూ సదస్సులో పాల్గొంటారని కావున పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ఉమ్మడి ఎన్డిఎ కూటమి తెలుగుదేశం జనసేన బిజెపి మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



## ఇచా ఫౌండేషన్ కు నిత్యావసరాల వితరణ

స్వచ్ఛంద సేవలో రాజయోగాశ్రమ ట్రస్టు



**గాజువాక: పెన్ పవర్, డిసెంబర్ 29:**శారీరక మరియు మానసిక వైకల్యంతో ఉన్న పిల్లలను అక్కున చేర్చుకొని సేవలందిస్తున్న కొండకర్ల లోని ఇచా ఫౌండేషన్ కు తోటాడ శ్రీ ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్టు తరపున నెల రోజులకు సరిపడా నిత్యావసరాలను,పిల్లకు ఉపయోగించే మరికొన్ని వస్తువులను అందజేశారు.ఆశ్రమ ట్రస్టు సభ్యులు బృందంగా వెళ్లి అక్కడి పిల్లలతో కాసేపు గడిపారు.ఫౌండేషన్ ద్వారా చేస్తోన్న సేవలను అడిగి తెలుసుకున్నారు.ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న కుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ లో పిల్లలకు చేస్తోన్న సేవలు తమను కదిలించాయని ఆ సందర్భంగానే ఇవన్నీ సమకూర్చి అందజేసినట్లు తెలిపారు.ఫౌండర్ తుగ్నైట్ మధు,ఫిజియోథెరఫిస్ట్ పవన్,ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు

## గిరిజన సంప్రదాయాలను కాపాడేలా పండుగలు





● కందికొత్తల పండుగ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు

**కురుపాం/పార్వతీపురం, డిసెంబర్ 29 :** ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను కాపాడుతూ, మరింత జీవనోపాధి కల్పిస్తూ ఇటువంటి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గిరిజనులకు పిలుపునిచ్చారు. గిరిజన సంప్రదాయ కందికొత్తల పండుగ ఉత్సవాలు గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరితో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొనగా ఆదివాసీలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయించి, గిరిజన నృత్యాన్ని ఆదివాసీలతో కలిసి చేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రహదారులు లేని గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో గిరిజనులు రాణించేలా డీఎస్సి కోచింగ్ సెంటర్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వీటితో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకునేలా అనేక రకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుమ్మలక్ష్మీపురంలో కౌమార దశలో ఉన్న ఆడపిల్లల కొరకు ఒక కోచింగ్ సెంటర్ ను కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఏనుగుల సమస్యకు పరిష్కారం చేయనున్నామని, కంటైనర్ ఆసుపత్రులను రెండు చోట్ల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇంకా మరెన్నో కార్యక్రమాలను చేపట్టబోతున్నామని, ఇందుకు గిరిజనులు కూడా పూర్తిగా సహకారం అందిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క సంప్రదాయాన్ని కాపాడుతూ, గిరిజనులకు మరింత జీవనోపాధి కల్పించి, ఈ పండుగల్ని ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, గిరిజనులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు





## బాధిత కుటుంబానికి ఆసరా..

సి.ఎం. రిలీఫ్ ఫండ్ నుంచి రు 2 లక్షల 76 వేల 279 చెక్కు ను అంద చేసిన ఎమ్మెల్యే



**కురుపాం/ జియ్యమ్మవలస, పెన్ పవర్, డిసెంబరు - 29.**జియ్యమ్మవలస మండలం అలమండ గ్రామ పంచాయితీ,అప్పన్నదొరవలస గ్రామంలో ఏలూరు మధుమతి బ్రెయిన్ చూమర్ తో బాధపడుతున్న కారణంగా ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి సహాయనిది నుండి రూ. 2,76,279 రూపాయలను బాధిత కుటుంబానికి మంజూరు చేయించడం జరిగినది. మంజూరైన మొత్తం చెక్కు రూపంలో తోయక జగదీశ్వరి చేతుల మీదుగా మండల నాయకుల సమక్షంలో చెక్కును బాధిత కుటుంబానికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, జియ్యమ్మవలస మండల ఎంపీపీ బొంగు సురేష్ ,అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ , వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎం. సత్యం నాయుడు ,టిడిపి సీనియర్ నాయకులు దాసర రామారావునాయుడు, టీడీపి కురుపాం నియోజకవర్గం వేలమ సాధికారసమితి అధ్యక్షులు రెడ్డి బలరామస్వామి నాయుడు, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురన శ్రీరామ్మూర్తి నాయుడు, కురుపాం నియోజకవర్గం తూర్పుకాపు సాధికార సమితి అధ్యక్షులు లంక గోపాలం , వైస్ ఎంపిపి బిడ్డిక నరేష్ , టీడిపి సీనియర్ నాయకులు బడే సత్యం నాయుడు , పూడి సీతారాం ,కోటి , గ్రామ సర్పంచ్ ఊయక మన్మధ , మరియు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టి నాయకులు కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చింతమానుగూడ లో నీటి ఎద్దడి..



**కురుపాం, పెన్ పవర్, డిసెంబరు-29.**కురుపాం మండలం జి.శివడ పంచాయతీ చింతమాను గూడ లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంటింటికీ కుళాయి మంజూరు చేసిన గ్రామంలో అధిక జనాభా దృష్ట్యా నీటి సమస్యను ఎదురుకుంటున్నామని గిరిజన మహిళలు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్య ను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.ం

## జీకే వీధి బిజెపి మండల అధ్యక్షునిగా కాకూరు శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నిక





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 29:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల బిజెపి మండల అధ్యక్షునిగా కాకూరు శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిజెపి మండల పార్టీ ఎన్నికలకు జిల్లా ఎన్నికల ఇన్చార్జీలు బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, బిజెపి సీనియర్ నాయకులు కుడుముల వెంకటరమణ మాస్టారు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గూడెం కొత్త వీధి దేరాల గ్రామంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు జోగిరాజు ఇంటి వద్ద బిజెపి మండల అధ్యక్షులు ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగింది.ఈ ఎన్నికల్లో బిజెపి మండల అధ్యక్షుడిగా కాకురు శేఖర్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా కాకూరు శేఖర్ ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన మండల బిజెపి అధ్యక్షుడు కాకూరు శేఖర్ ను ఎన్నికల పరిశీలకుల తో పాటు బిజెపి నాయకులు అభినందించారు. ఈ ఎన్నికలలో బిజెపి క్రియాశీలక కార్యకర్తలు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బోండ్ల చిరంజీవి, అరకు పార్లమెంట్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దుక్కెరి ప్రభాకర్, బిజెపి నాయకులు సన్యాసయ్య, లకే లక్ష్మణ్, కరణం రాము, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలను ప్రజల వద్దకు విరివిగా తీసుకొని వెళ్లి బిజెపి పార్టీ క్షేత్రస్థాయిలో బలపడటానికి కృషి చేయాలని, అన్ని బూతుల్లో కార్యక్రమాలు చేపట్టి పూర్తిస్థాయిలో బిజెపి నాయకులు అన్ని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి బిజెపి అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

## పారిశ్రామిక ప్రాంతం లో కడూ రమణీయంగా శ్రీనివాస కళ్యాణం





**గాజువాక:పెన్ పవర్, డిసెంబర్ 29:**అఖిలభారత గోవింద మాల ప్రచార చారిటబుల్ ట్రస్ట్ గోవింద స్వాములు పి ఎస్ ఆర్ గ్రూప్ అధినేత ప్రముఖ న్యాయవాది పెంటకోట శంకర్రావు ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం శ్రీ శ్రీనివాస కళ్యాణం కూడా రమణీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోలాటంలు అన్నమయ్య సంకీర్తనలు పిల్లల భరతనాట్యం దయాల్ నగర్ క్వారీ రోడ్డు పురవీధుల్లో స్వామివారిని ఊరేగింపుగా కోలాటంతో తీసుకు వెళుతూ ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందంగా భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయినారు .ఉదయం సుప్రభాత సేవతో మొదలై సుప్రభాత సేవ తోమాల సేవ స్వామి వారి కళ్యాణం అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం ఇలా కదు రమ్యంగా ఎంతో ఆనందంగా శ్రీనివాస్ కళ్యాణం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మరియు 74 వ వార్డు కార్పొరేటర్ వంశీ రెడ్డి మరియు ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది పెంటకోట వెంకట నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు పీఎస్ఆర్ గ్రూపు సభ్యులు మరియు గోవింద స్వాములు అర్జగిరి అప్పారావు ఈశ్వరరావు నీలాపు మహేశ్వరరావు అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలి... ఎల్విన్ పేట సీఐ హరి...



**కురుపాం /గుమ్మ లక్ష్మీపురం , పెన్ పవర్, డిసెంబరు -29.**

పట్టుదల తో చదివి ప్రభుత్వ కొలువులు పొందాలని ఎల్విన్ పేట సి. ఐ.హరి అన్నారు.ఆదివారం ఎల్విన్ పేట పోలీస్ సర్కిల్ పరిధిలో కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న 44 మంది అభ్యర్థులకు సర్కిల్ కార్యాలయం వద్ద శిక్షణకు సంబంధించి అవగాహన కల్పించి సొంత నిధులతో టి షర్ట్స్, ట్రాక్ ఫ్యాంట్, షూస్ ఉచితంగా అందజేసిన ఎల్విన్ పేట సీఐ హరి.

ఈ కార్యక్రమంలో ఎస్. ఐ. శివ ప్రసాద్, నారాయణ రావు, నీలకంఠ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాలెం రైతు బజార్ వద్ద క్లాత్ సంచులు పంపిణీ

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, డిసెంబర్ 29 :**

జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం మర్రిపాలెం రైతు బజార్ వద్ద క్లాత్ సంచులు పంపిణీ %ు% ప్లాస్టిక్ వినియోగము వలన కలుగు ఆనర్థాలపై అవగాహన కార్యక్రమం జీవీఎంసీ అధికారుల సమక్షంలో నిర్వహించడం జరిగింది ముందుగా ప్లాస్టిక్ కవర్లుతో రైతు బజారుకు వచ్చే కొనుగో లుదారుల వద్ద నుండి ప్లాస్టిక్ కవర్ తీసుకుని గుడ్డ సంచి ఇవ్వడం జరిగింది జీ.వీ.ఎం.సీ అధికారి జనార్ధన్ గారు మాట్లాడుతూ జనవరి ఒకటి నుండి సింగల్ యూస్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమ ని వర్తకులు కొనుగోలు దారులకు ఇచ్చినా ప్రజలు వాడినా జరిమానా విధించబ దునని తెలిపారు పర్యావరణ పరిరక్షణ కొరకు జేడీ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించా రు. ఈకార్యక్రమంలో ఉత్తరాంధ్ర కన్వీనర్ కారు మూడి అను,రైతుబజార్ ఎస్టేట్ అధికారి నారా యణరావు,శానిటరీ ఇన్స్టక్టర్ కిరణ్ కుమార్, ఇతర జీ.వీ.ఎం.సీ సిబ్బంది స్టాఫ్,జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. .

## వృద్ధులు మరియు వితంతువులకు చీరలు వితరణ...



**కురుపాం , పెన్ పవర్, డిసెంబర్-29,** యస్ సొసైటీ ఆధ్వర్యంలో కురుపాం మండలం ఉస కొండ పంచాయితీలో 100 మంది వృద్ధులు మరియు వితంతువులకు సంక్రాంతి మరియు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం చీరలను వితరణ గా అందించారు, విశాఖ పట్టణానికి చెందిన బ్యాంక్ ఉద్యోగి నగేష్ మరియు వారి మిత్రుల సహకారంతో మారుమూల గ్రామాల్లోని గిరిజనులకు చీరలు పంపిణీ చేసినట్టు యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ చెప్పారు మరెవరైనా దాతలు ముందుకొచ్చి చీరలు , బట్టలు మరియు దుప్పట్లు అందిస్తే మారుమూల గ్రామాల్లోని వృద్ధులకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు దాతలు మరియు యస్ సొసైటీ వారికి ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు అడ్డమేశ్వర రావు , ఉసకొండ పాఠశాల సవర భాష వాలంటీర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ ఈశ్వరి విశ్వవిద్యాలయం నూతన క్యాలండర్ ఆవిష్కరణ



**నర్సీపట్నం, పెన్ పవర్ (డిశెంబర్ 29) :**అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ప్రజాప్రతితం బ్రహ్మకుమారిస్ ఈశ్వరి విశ్వవిద్యాలయం వారి నూతన సంవత్సర క్యాలెండర్ ను జర్నలిస్టులతో ఆవిష్కరింపజేశారు. శారదానగర్ రెండవ లైన్ లో ఉన్న ఓంశాంతి సెంటర్ నందు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిశ్వరియ విశ్వవిద్యాలయంలో ఇప్పుడు ఉన్న భయంకరమైన పరిస్థితులను ఎదుర్కోవాలన్న మరియు శాంతిగా ప్రేమగా మనిషి ఉండాలన్న శారీరక మానసికంగా ఏ విధంగా తయారవ్వాలి అనేది ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియం విశ్వవిద్యాలయంలో చెప్పడం జరుగుతుంది అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యము అనేది ప్రతి ఒక్కరికి రావాలన్న ధ్యానము చేయడం అనేది తప్పని సరి అని తెలిపారు. సర్వలోకాలకు నివారణ అనేది బ్రహ్మకుమారిస్ ద్వారా ధ్యానం నేర్పించి చేయించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క జర్నలిస్టు సోదరుడు మౌంట్ అబు ని సందర్శన చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు ఆద్యాత్మిక చింతన కలిగి ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జాప్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్సి యలమంచిలి వేణు, కార్యవర్గ సభ్యులు కోసూరు రామకృష్ణ, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అద్యక్షుడు గొర్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కన్న కొడుకును కొట్టి చంపిన తండ్రి

- రాయితో కొట్టిన తండ్రి రమణ
- నిందితుడు నేవి రిటైర్డ్ ఉద్యోగి





**నర్సీపట్నం, పెన్ పవర్ ( డిశెంబర్ 29 )** :అనకాపల్లిజిల్లా, నర్సీపట్నం మున్సిపాలిటీ 22వ వార్డులో కన్న కొడుకుని రాయితో కొట్టి చంపిన సంఘటన కలంకలం రేపింది. మద్యం మత్తులో తండ్రి కొడుకులు మధ్య జరిగిన ఘర్షణ కొడుకు మృతికి కారణమైన ఉదంతమిది.

నర్సీపట్నం టౌన్ సిఐ గోవిందరావు కథనం ప్రకారం నిందితుడు కొఠారి రమణ రిటైర్డ్ నేవీ ఉద్యోగి. కొడుకు భాస్కరరావుతో కలిసి ఒక ఇంట్లో ఉంటున్నారు. కుమార్తెకు వివాహం కావడంతో వారు వేరే ఇంట్లో కాపురం ఉంటున్నారు. కుమారుడు భాస్కరరావు మాత్రం తండ్రి పై ఆధారపడుతూ ఆవారాగా తిరుగుతూ ఉంటాడు. అయితే కొద్దికాలంగా కొడుకు చిల్లర తిరుగుళ్ళపై తరచూ గొడవలు పడేవారు. శనివారం సాయంత్రం భాస్కరరావు తన మిత్రుడితో కలిసి బయట మద్యం సేవించి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన తర్వాత తండ్రితో కలిసి ముగ్గురు కొద్దిసేపు మద్యం సేవించారు. తర్వాత ఆ స్నేహితుడు బయటికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత తండ్రి కొడుకులు మధ్య వివాదం చిలికి చిలికి గాలి వాన అయింది. ఇంట్లో ఉన్న సన్నికాలు రాయితో కొడుకును తీవ్రంగా కొట్టాడు. కొడుకు భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మద్యం మత్తులో కొడుకు చనిపోయాడు అన్న విషయాన్ని రమణ గుర్తించలేదు. తెల్లవారేసరికి వచ్చిన పనిమనిషి రక్తపు మడుగులో ఉన్న భాస్కర్ చూసి కుమార్తె పార్వతికి సమాచారం ఇచ్చింది. పార్వతి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. నిందితుడు రమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గోవిందరావు తెలిపారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నీదా... నాదా ...?






- పోటీ పడుతున్న ఐదు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు...
- తమకు ఈ దఫా అవకాశం కల్పించాలని కోరుతున్న జన సేనా నాయకులు...
- బరిలో తొమ్మిది మంది ఆశా వహులు...
- ప్రధానంగా వినిపిస్తున్న టిడిపి కి చెందిన చందక రామకృష్ణ, గుంట ముక్కల వెంకట రమణ మూర్తి పేర్లు ..

**కురుపాం, పెన్ పవర్, డిసెంబరు- 29.**కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నీదా...నాదా ..? అంటూ కురుపాం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, జన సేనా నాయకులు పోటీ పడుతూ తమకే దక్కాలనే పట్టుదలతో తమకున్న రాజకీయ పలుకుబడి తో ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రాబునాయుడు జనవవరి మొదటి వారంలో గా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎంపిక పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ల కు సూచించటంతో ఎంపిక ప్రక్రియ కు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం తెలుగు తమ్ముళ్లు పదవిని దక్కించు కొనేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

**బరిలో పది మంది ఆశా వహులు....**

కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని థక్కించు కొనేందుకు పది మంది వరకు ఆశా వహులు ప్రయత్నాలు చేస్తున్నారు .అంతే కాకుండా తమకు పై స్థాయి లో ఉన్న పలుకు బడిను వినియోగించు కొనే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. కురుపాం ఏ.ఎం. సి కు నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలైన కురుపాం ,గుమ్మలక్ష్మిపురం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో చైర్మెన్ పదవికి టిడిపి నుంచి చందక రామ కృష్ణ ( ఆర్.కే), మాజీ ఎంపిపి గుంట ముక్కల రమణమూర్తి, కర్రి శ్రీనువాసరావు, బిజ్జుపురం శంకరరావు, గూరాన శ్రీరామ్మూర్తి ,పల్ల రాంబాబు పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే జన సేనా నుంచి కద్రక మల్లేష్ పేరు వినిపిస్తున్నాయి. వీరిలో కురుపాం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ జగ దీశ్వరి కొంత మంది వైపు మొగ్గ చూపగా, టీడిపి రాష్ట్ర కార్యదర్శి విరేష్ దేవ్ మరికొంత మంది వైపు మొగ్గు చూపుతున్నారు. వీరిలో ఎవరికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా గతంలో ఏ. ఎం. సి ఛైర్మెన్ పదవి కేవలం బిసి వర్గానికి చెందిన వారే పొందగా , ఒక దఫా ఎస్సీ వర్గానికి వచ్చింది. ప్రస్తుత టీడిపి ప్రభుత్వం నియోజక వర్గంలో జనాభా,ఓటర్ల ప్రాతి పదికన చూస్తే ఈ దఫా ఎస్టీ సామాజిక వర్గానికి అవకాశం దక్కే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.







## వైద్య విభాగంలో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు



**కురుపాం /పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబరు 29 :** ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ లో మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్ లలో ఎయిర్‌మెన్‌గా చేరుటకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అదనపు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్ లలో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు శాశ్వతమైన ప్రాతిపదికన నియామకం జరుగుతుందని, పెన్షన్ లభిస్తుందని ఆయన తెలిపారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో యువత రిక్రూట్‌మెంట్ ర్యాలీ లో పాల్గొనాలని ఆయన ఆకాక్షించారు.

**ఇంటర్మీడియట్ అర్హతతో మెడికల్ అసిస్టెంట ఉద్యోగం**

1 ఇంటర్మీడియట్ లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్స్ తో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.
2 అన్ని సబ్జెక్టుల్లో సగటున 50% మార్కులు ఉండాలి,
3 50% మార్కులు ఇంగ్లీషులో కూడా రావాలి,
4 పెళ్ళికాని యువకులు, 03/07/2004 నుండి 03/07/2008 మధ్యలో పుట్టిన అభ్యర్థులు అర్హులు.
5 డిప్లొమా ఫార్మసీ తో మెడికల్ అసిస్టెంటు ఉద్యోగం
6 ఇంటర్మీడియట్ లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్స్ తో ఉత్తీర్ణులై ఉండాలి
7 సరాసరి 50% మార్కులు ఉండాలి,
8 50% మార్కులు ఇంగ్లీషులో కూడా రావాలి,
9 50% మార్కులతో %డీ.ఫాఎ%/డిప్లొమా ఫార్మసీ లో కలిగి ఉండాలి
10 పెళ్ళికాని యువకులు, 03/07/2001 నుండి 03/07/2006 మధ్యలో పుట్టిన అభ్యర్థులు అర్హులు.
11 పెళ్లి అయిన యువకులు 03/07/2001 నుండి 03/07/2004 మధ్యలో పుట్టిన అభ్యర్థులు అర్హులు.

**సెలక్షన్ విధానం:-**

1) ఫిజికల్ ఫిట్నెస్ పరీక్ష,
2) వ్రాత పరీక్ష,
3) మెడికల్ పరీక్ష ఉంటాయి.

పైనా పేర్కొన్న అర్హతలను కలిగి ఉన్న అభ్యర్థులు మహరాజన్స్ కాలేజీ గ్రౌండ్, పి.టీ ఉష రోడ్డు, షీనస్, ఎర్నాకులం, కొచ్చి, కేరళ - 682011 చిరునామాలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరిగే రిక్రూట్మెంట్ ర్యాలీలో అర్హత కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన అభ్యర్థులు 2025 హాజరు కావచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

వివరాలకు %ఫ్ట్రజూం://ఖఅతీఎవఅంవశ్రీవఫ్‌అశీఅ.ఎఖఎ.అఅ% వెబ్ సైట్ ను సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లాలోని పార్వతీపురం నియోజక వర్గం అభ్యర్థులు 9177297528 ఫోన్ నంబరు, పాలకొండ - 7993795796 , సాలూరు - 7382559022, కురుపాం - 6303493720 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని శ్యామ్ ప్రసాద్ తెలిపారు.

## గిరిజన సంప్రదాయాలను కాపాడేలా పండుగలు

**కందికొత్తల పండుగ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు**

**కురుపాం/పార్వతీపురం, పెన్ పవర్ డిసెంబర్ 29 :** ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను కాపాడుతూ, మరింత జీవనోపాధి కల్పిస్తూ ఇటువంటి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గిరిజనులకు పిలుపునిచ్చారు. గిరిజన సంప్రదాయ కందికొత్తల పండుగ ఉత్సవాలు గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరితో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొనగా ఆదివాసీలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయించి, గిరిజన నృత్యాన్ని ఆదివాసీలతో కలిసి చేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రహదారులు లేని గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో గిరిజనులు రాణించేలా డీఎస్సి కోచింగ్ సెంటర్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వీటితో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకునేలా అనేక రకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుమ్మలక్ష్మిపురంలో కౌమార దశలో ఉన్న ఆడపిల్లల కొరకు ఒక కోచింగ్ సెంటర్ ను కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఏనుగుల సమస్యకు పరిష్కారం చేయనున్నామని, కంటైనర్ ఆసుపత్రులను రెండు చోట్ల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇంకా మరెన్నో కార్యక్రమాలను చేపట్టబోతున్నామని, ఇందుకు గిరిజనులు కూడా పూర్తిగా సహకారం అందిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క సంప్రదాయాన్ని కాపాడుతూ, గిరిజనులకు మరింత జీవనోపాధి కల్పించి, ఈ పండుగల్ని ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, గిరిజనులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# చేపల వేటకి వెళ్ళి మత్స్యకారుడు మృతి.





**పరవాడ ( పెన్ పవర్) డిసెంబర్ 29:** అనకాపల్లి జిల్లా,

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ దిబ్బపాలెం గ్రామానికి చెందిన కొవిరి మసేను( 30) అనే మత్స్యకారుడు చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానిక మత్స్యకారులు అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు ప్రాంతంలో సముద్రం లో ,కోవిరి మసేను మరి కొందరు మత్స్యకారులు చేపల వేట చేస్తూవుండగా ప్రమాద శాత్తు సముద్రంలో గల్లంతయ్యారు .

తనతో పాటు వెళ్ళిన మత్స్యకారులు వెతకగా మసేను మృతదేహం మత్స్యకారులుకి కనిపించింది. అప్పటికే మసేను మృతి చెందడంతో తోటి మత్స్యకారు పరవాడ పోలీసులకు ,మత్స్యశాఖా అధికారులకి ,పంచాయతీ అధికారులకి తెలియజేశారు .సంఘటన స్థలానికి అందరూ చేరికోని .మృతదేహాన్ని శవపంచనామానికి కోసం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కి తరలించారు .

ఆ పంచనామాలు అనంతరం తిరిగి ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీకి తీసుకొని రావడం జరిగింది .

దిబ్బపాలెం స్మశాన వాటికలో అంత్యక్రియలు లో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు,హాజరై మసేను మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన మసేను కుటుంబాన్ని ఆదుకోవాలని

స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుని కోరారు . రాష్ట్ర ప్రభుత్వంతో ద్వారా మృతి ని కుటుంబానికి ఎక్సగ్రేసియా,చంద్రన్న బీమా ,పథకం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మృతుని అంత్యక్రియలలో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఎంపిటీసి అర్జిల్లి రవిదేవి ,మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు ,మత్స్యకార సొసైటీ అధ్యక్షులు కోవిరి ముత్యాలు మరియు మృతిని కుటుంబ సభ్యులు ,మరియు స్దానిక మత్స్యకార నాయకులు , గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేర్నితో టచ్లో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరు?



**హైదరాబాద్ పెన్ పవర్:** మచిలీపట్నంలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. గత 20 రోజులుగా మాజీ మంత్రి పేర్ని నాని టార్గెట్ గా అధికార పార్టీ పావులు కదపడం, ఈ వివాదం నుంచి ఎలాగోలా బయటపడాలని అధికారులు, నేతల సహకారంతో పేర్ని నాని ప్రయత్నించడం విపరీతమైన చర్చకు దారితీసింది. అదేవిధంగా టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు తనతో టచ్ లో ఉన్నారని, ఈ విషయంలో ఏమీ చేయలేమని వారు చెప్పినట్లు శనివారం నిర్వహించిన ప్రెస్ మీట్లో వెల్లించారు పేర్ని నాని. దీంతో ఆయనతో టచ్లో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరన్న చర్చ టీడీపీలో వేడిపుట్టిస్తోంది.గత ప్రభుత్వంలో రవాణా మంత్రిగా పనిచేసిన పేర్ని నాని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయారు. ఆయన స్థానంలో కుమారుడు పేర్ని కిట్టూను పోటీకి పెట్టారు. కిట్టూపై ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్ర ఘన విజయం సాధించారు. 2014 నుంచి కొల్లు, పేర్ని మధ్య రాజకీయ యుద్ధం జరుగుతోంది. ఈ పొలిటికల్ ఫైట్ కొన్నాళ్లుగా పరిధి దాటి వ్యక్తిగత వైరంగా మారింది. గత ప్రభుత్వంలో ఓ హత్య కేసులో కొల్లును జైలుకు పంపించారు. దీంతో ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తున్న మంత్రి కొల్లుకి.. రేషన్ బియ్యం మాయం కేసు అస్త్రంగా మారింది.పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకున్న పేర్ని జయసుధ గిడ్డంగిలో దాదాపు మూడు వేల బస్తాల రేషన్ బియ్యం మాయమయ్యాయి. దీనిపై ప్రభుత్వం దొంగతనం కేసు పెట్టింది. పౌరసరఫరాల అధికారుల ఫిర్యాదు మేరకు గొడౌన్ యజమాని జయసుధపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడమే కాకుండా, ఆమెను అరెస్టు చేసేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం పేర్ని జయసుధ హైకోర్టును ఆశ్రయించారు. అయితే జయసుధకు బెయిల్ రాకుండా మంత్రి కొల్లు అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ శనివారం మీడియా ముందుకు వచ్చిన పేర్ని నాని.. వ్యక్తిగతంగా కక్ష తీర్చుకోవాలంటే తన సతీమణిని విడిచిపెట్టి, తనను అరెస్టు చేయాలని సవాల్ విసిరారు. ఈ సందర్భంలో టీడీపీలో తనకు ఎందరో మిత్రులు ఉన్నారని, ఈ సమయంలో ఎలాంటి సాయం చేయలేమని వారు చేతులెత్తేస్తున్నారని సంచలన విషయం బయటపెట్టారు. దీంతో పేర్నికి అంత సన్నిహితులైన నేతలు టీడీపీలో ఎవరున్నారనే విషయమై అధిష్టానం ఆరా తీస్తోంది.గత ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పై పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడేవారు. జనసేనాని పవన్ కు కనీస గౌరవం ఇవ్వకుండా విమర్శలు గుప్పించేవారు. దీంతో కూటమి ప్రభుత్వం హిట్ లిస్టులో పేర్ని నాని పేరు ఎప్పుడో చేర్చారని చెబుతున్నారు. ఇన్నాళ్లు ఆయన విషయంలో ఏ ఆధారాలు దొరక్కపోవడంతో ఏడు నెలలుగా వేచిచూశారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా పేర్నికి అక్రమ మైనింగ్ వ్యాపారాలు ఉన్నాయనే ఆరోపణలు చేసేది. అధికారంలోకి వచ్చాక తగిన ఆధారాలు లేక సమయం కోసం వేచిచూసింది. ఈ పరిస్థితు ల్లోనే బియ్యం అక్రమ తరలింపు విషయం బయటపడింది. ఈ ఇష్యూలో పేర్ని కుటుంబం అడ్డంగా దొరికిందనే భావనతో మంత్రి కొల్లు రవీంద్ర పకడ్బందీగా వ్యూహరచన చేసి పేర్ని అరెస్టుకు ప్రణాళిక వేశారు. అయితే ఎప్పటికప్పుడు ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తెలుసుకున్న పేర్ని నాని తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఇంతవరకు చిక్కకుండా తిరుగుతున్నారు.వాస్తవానికి బియ్యం తరలింపులో పేర్ని నాని నిందితుడు కాదు. కానీ, ఇతర నిందితులతో ఆయన పేరు చెప్పించి నిందితుల జాబితాలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్ని నాని అనుమానిస్తున్నారు. దీంతో టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులతో టచ్లో ఉంటూ ఎప్పటికప్పుడు తనకు వ్యతిరేకంగా ఏం జరుగుతుందో తెలుసుకుంటు న్నారు. దీంతో ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. లీకులు లేకుండా పేర్ని నానిని ఇరికించేలా వ్యూహం సిద్ధంచేసిందంటున్నారు. దీంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో మీడియా ముందుకు వచ్చిన పేర్ని నాని, తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆరోపించి కాక రేపారు. ఇదే సందర్భంలో టీడీపీలో ఉన్న తన మిత్రుల సహకారంపై ఆయన కామెంట్లు చేయడం రాజకీయంగా హీట్ పుట్టించింది.పేర్ని కామెంట్లతో టీడీపీ అధిష్టానం రంగంలోకి దిగింది. పేర్నికి సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరనే విషయమై ఆరా తీస్తోంది. ప్రభుత్వ సమాచారం ప్రత్యర్థులతో పంచుకోవడంపై పార్టీలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో పేర్ని అనుసరించిన పద్ధతులను మరచిపోతే ఎలా అంటూ క్యాడర్ కూడా ఎమ్మెల్యేలు, మంత్రులను నిందిస్తున్నారు. ఈ కేసు బయటకు వచ్చిన నుంచి పేర్నిని రక్షించేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయని టాక్. ఒకవైపు అధికారులు, మరోవైపు అధికార పార్టీ నేతలు సహకారం ఉండటంతో తనకేమీ జరగదని తొలుత మాజీ మంత్రి పేర్ని లైట్ తీసుకున్నారు. అయితే ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించడంతో అన్ని రకాలుగా టైట్ చేశారు. ఫలితంగా తన సతీమణికి బెయిల్ దొరకడం క్లిష్టంగా మారడంతో సీఎం చంద్రబాబును ప్రసన్నం చేసుకునేలా మాట్లాడటమే కాకుండా టీడీపీలో తనకు మిత్రులు ఉన్నారని, తన ప్రత్యర్థులను భయపెట్టేలా స్టేట్మెంట్ ఇచ్చారంటున్నారు. పేర్ని నాని చేసిన పనికి ఇన్నాళ్లు ఆయనతో టచ్లో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు టెన్షన్ పడుతున్నట్లు చెబుతున్నారు.

# విమాన ప్రమాదంలో 179 మంది మృతి... ఆ పక్షి కారణమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల అజర్ బైజన్ ఎయిర్ లైన్స్ కు చెందిన ఫ్లైట్ జే2 - 8243 విమాన ప్రమాదంలో సుమారూ 40 మంది మృతి చెందడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే! ఆ విమాన ప్రమాదానికి పక్షి ఢీకొనడమే కారణం అనే కథనాలు రాగా.. ఆ విమానాన్ని ఉక్రెయిన్ డ్రోన్ గా భావించి రష్యా దాడి చేసిందనే చర్చా తెరపైకి వచ్చింది.దీంతో... ఆ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో తాజాగా దక్షిణ కొరియాలోని ముయాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో ఘోర ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. అయితే... ఈ ప్రమాదానికి కారణం ల్యాండింగ్ గేర్ వైఫల్యమే అని అంటున్నా.. దానికంటే ముందు పక్షి ఢీకొనడం వల్లే ఇది జరిగిందనే చర్చ తెరపైకి వచ్చింది.అవును... బ్యాంకాక్ నుంచి బయలుదేరిన ది బేజు ఎయిర్ ఫ్లైట్ కు చెందిన 7సీ2216 నంబర్ బోయింగ్ 737-800 శ్రేణి విమానం ల్యాండ్ అవుతూ అదుపుతప్పి, రక్షణ గోడను ఢీకొని, మంటల్లో చిక్కుకుని పేలిపోయింది. ఈ ఘోర ప్రమాదానికి ల్యాండింగ్ గేర్ వైఫల్యమే ప్రధాన కారణం అని తెలుస్తోందని అంటున్నారు.ఈ సందర్భంగా స్పందించిన అధికారులు.. ఈ విమానం ప్రమాదానికి ముందు ఒకసారి ల్యాండింగ్ కు యత్నించి విఫలమైందని పేర్కొన్నారు. ఇది ఎయిర్ పోర్ట్ లో గోడను ఢీకొనడంతో విమానంలో ఇంధనం ఒక్కసారిగా మండిందని.. మంటలు వ్యాపించాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పక్షి ఢీకొట్టిందనే విషయం తెరపైకి వచ్చింది.ఈ సందర్భంగా స్పందించిన దక్షిణ కొరియా ఫైర్ చీఫ్ లీ జియోంగ్ హ్యాయాన్... విమానం ఇంజిన్ ను పక్షి ఢీకొనడం.. వాతావరణ పరిస్థితుల కారణంగా ల్యాండింగ్ గేర్ లో సమస్య కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు. ఇదే సమయంలో... ప్రమాదం జరిగిన వీడియో దృశ్యాల్లో కూడా విమానం రన్ వేపై అదుపుతప్పి దుసుకెళ్తూ గోడను ఢీకొనే సమయానికి ల్యాండింగ్ గేర్ వెనక్కే ఉన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు.ఇదే సమయంలో... జరిగిన ప్రమాదానికి థాయిల్యాండ్ కు చెందిన జేజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. అదేవిధంగా... ప్రమాద నివారణకు తాము శక్తివంచన లేకుండా ప్రయత్నించినట్లూ వెల్లడించింది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని ప్రకటించింది.ఇక, ఈ ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో ఆరుగురు సిబ్బందితో పాటు 175 ప్రయాణికులు ఉన్నారని చెబుతున్నారు. అయితే... వారిలో ఇద్దరు సిబ్బంది మాత్రమె ప్రాణాలతో బయటపడగా.. మిగిలిన 179 మంది మృతి చెందినట్లు చెబుతు న్నారు. విమానంలో భారీ పేలుడు సంభవించడంతో అది మొత్తం కాలిపోయిందని అధికారులు ధృవీకరించారు. మరోపక్క.. ఈ విమాన ప్రమాదంపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ స్పందిస్తూ.. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసు, అగ్నిమాపక శాఖలతో పాటు ఇంటీరియర్, ల్యాండ్ మినిస్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.ఇదే సమయంలో... ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని విమానాల రాకపోకలను రద్దు చేశారు. కాగా... దక్షిణ కొరియాలో 1997లో జరిగిన విమాన ప్రమాదంలో 228 మంది మృతిచెందగా.. ఆ తర్వాత ఇదే పెద్ద ప్రమాదం అని చెబుతారు!

# హెచ్-1బీ వీసాలపై మస్క్ మాటే ట్రంప్ మాట!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్.. వచ్చే ఏడాది జనవరి 20న అగ్రరాజ్యం అధినేతగా బాధ్యతలు స్వీకరించనున్న సంగతి తెలిసిందే! ఈ సమయంలో ప్రధానంగా హెచ్-1బీ వీసాలపై తీవ్ర చర్చమొదలైంది. ట్రంప్ తీసుకోబోయే నిర్ణయాలపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు.ప్రధానంగా సుంకాల విధింపు విషయంలో పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. హెచ్-1బీ వీసాల విషయంలో మరికొన్ని దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని అంటున్నారు. పైగా డొనాల్డ్ ట్రంప్ పార్టీలో హెచ్-1బీ వీసాల విస్తరణపై భిన్నాభిప్రాయాలు వక్తమవుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ స్పందించారు.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.అవును... హెచ్-1బీ వీసాల విస్తరణపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని అంటున్న వేళ.. ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి ఈ చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తున్న వేళ.. అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ సందర్భంగా ఈ వీసా ప్రోగ్రాంకు తాను మద్దతిస్తానని తెలిపారు.

ఇందులో భాగంగా... నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు అమెరికాకు రావడానికి ఉపయోగపడే ప్రత్యేక వీసా ప్రోగ్రామ్ కు తాను మద్దతిస్తున్నానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇదే సమయంలో... తాను ఎల్లప్పుడూ హెచ్-1బీ వీసాలకు అనుకూలంగా ఉంటానని.. అందుకే తమ దేశంలో ఈ వీసాలు ఉన్నాయని అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు.

ఇదే సమయంలో... ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి ఈ విషయంపై మాట్లాడారు. ఇందులో భాగంగా... అమెరికా తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్లను తయారు చేస్తున్నందున.. ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గలవారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్-1బీ వీసా ఉపయోగపడుతుందని తెలిపారు.డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డీఓజీఈ) సంయుక్త సారథులుగా నియమితులైన ఇద్దరూ... టాలెంట్ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని.. ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటిస్థానంలో ఉండాలంటే ఈ వీసా ప్రోగ్రాం కు మద్దతూ ఇవ్వాలని కోరడం గమనార్హం. మస్క్ కూడా హెచ్-1బీ వీసా ద్వారానే యూఎస్ కి వచ్చిన సంగతి తెలిసిందే.కాగా... ఈ వ్యవహారంపై స్పందించిన రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ.. తాను సౌత్ కరోలినా గవర్నర్ గా పనిచేసిన సమయంలో 11 శాతం ఉన్న నిరుద్యోగిత రేటు 4 శాతానికి పడిపోయిందని.. దీనికి కారణం.. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించడం అన్ని చెప్పిన సంగతి తెలిసిందే.

అయితే... ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలిగ్గా నియమించుకొనేందుకు అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం పలు నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో పాటు.. ఎఫ్-1 విద్యార్థి వీసాలను సులువుగా హెచ్-1బీ వీసాలుగా మారుకొనే అవకాశం కల్పించింది. ఇది లక్షలాది మంది ఇండియన్ ప్రొఫెషనల్ ఎక్స్ పర్ట్స్ కి ప్రయోజనం కల్పించనుంది.

ఈ నేపథ్యంలో తాజాగా హెచ్-1బీ వీసాలకు నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు అమెరికాకు రావడానికి ఉపయోగపడే ప్రత్యేక వీసా ప్రోగ్రామ్ కు తాను మద్దతిస్తున్నానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇది ప్రధానంగా భారతీయులకు గుడ్ న్యూస్ అని అంటున్నారు పరిశీలకులు!

## చెస్ బోర్డును శాసించిన 'ఒక భారత రాణి'... హంపీపై ఆనంద్ మహీంద్ర!




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అద్భుతమైన ఘన సాధించింది. ఇందులో భాగంగా.. వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్ షిప్ లో భాగంగా ర్యాపిడ్ ఛాంపియన్ గా కోనేరు హంపి నిలిచింది. 8.5 పాయింట్లతో టోర్నీలో అగ్రస్థానానికి దూసుకెళ్లి విజయం సాధించింది. దీంతో సరికొత్త రికార్డ్ సృష్టించింది.వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్ షిప్ లో భాగంగా ర్యాపిడ్ ఛాంపియన్ గా కోనేరు హంపి నిలిచింది. హంపీకి ఈ తరహా ఛాంపియన్ షిప్ విజేతగా నిలవడం ఇదే తొలిసారి కాదు. 2019లోనూ హంపీ ఛాంపియన్ గా నిలిచారు. దీంతో... చైనా గ్రాండ్ మాస్టర్ జు వెంజున్ తర్వాత ఒకటికంటే ఎక్కువసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్ గా హంపీ రికార్డ్ సృష్టించారు.ఈ సందర్భంగా స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు... ఫిడే మహిళల వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ హంపీకి అభినందనలు అని తెలుపుతూ ఆమె విజయం దేశానికి గర్వకారణం అని తెలిపారు. మనదేశ చెస్ క్రీడాకారులకు 2024 మరిచిపోలేని సంవత్సరం అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా స్పందించారు.అవును... ఎన్నో ఆసక్తికర విషయాలు, ఇన్స్ పిరేషన్స్ కలిగించే వీడియోలు సోషల్ మీడియా ద్వారా పంచుకోవడం.. అలాంటివి సోషల్ మీడియాలో ఎక్కడైనా కనిపిస్తే వెంటనే వాటిపై ఆసక్తికరంగా స్పందించడం చేస్తుంటారు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా. ఈ నేపథ్యంలో తాజాగా తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపిపై స్పందించారు.ఇందులో భాగంగా... ఒక భారత రాణి చెస్ బోర్డును శాసించారని.. కోనేరు హంపీ తన అద్భుతమైన ఆట తీరుతో తమల్ని ఎంతో గర్వించేలా చేశారని చెబుతూ... భారత చెస్ కు అద్భుతమైన సంవత్సరంగా నిలిచిన ఈ ఏడాదికి విజయవంతమైన ముగింపును అందించినందుకు కృతజ్ఞతలు అని అంటూ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు.
కాగా.. ఇటీవల తమిళనాడుకు చెందిన దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన అతిపిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డ్ సృష్టించారు.

## టీడీపీ ఎమ్మెల్సీ కుమారుడు మృతి... పరామర్శించిన చిరంజీవి!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇందులో భాగంగా.. రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్ గుండెపోటుతో మరణించారు. ఆయనకు గుండెపోటు రాగా.. హైదరాబాద్ లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో రామచంద్రయ్య కుటుంబాన్ని మెగాస్టార్ చిరంజీవి పరామర్శించారు.అవును... టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఇంట్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... ఆయన కుమారుడూ విష్ణు స్వరూప్ శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. విష్ణు స్వరూప్ మరణవార్త తెలిసిన అనంతరం సినీ నటుడు చిరంజీవి స్పందించారు. రామచంద్రయ్య నివాసానికి వెళ్లారు.అనంతరం.. విష్ణుస్వరూప్ భౌతికకాయానికి నివాళులర్పించిన చిరంజీవి.. రామచంద్రయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా... చిరంజీవి 'ప్రజారాజ్యం' పార్టీలో రామచంద్రయ్య కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇక.. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందూ వైసీపీకి రాజీనామా చేసిన ఆయన టీడీపీలో చేరారు.

**ఏపీ సీఎం దిగ్భ్రాంతి, డిప్యూటీ సీఎం ప్రగాఢ సానుభూతి!:**
టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ సీ. రామచంద్రయ్య తనకుడు విష్ణుస్వరూప్ మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విష్ణు స్వరూప్ ఇలా గుండెపోటుతో మరణించడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. కుమారుడి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న రామచంద్రయ్య కుటుంబానికి దేవుడు మనోనిబ్బరాన్ని ఇవ్వాలని కోరారు.ఇదే సమయంలో... శాసన మండలి సభ్యులు రామచంద్రయ్య కుమారుడు విష్ణు స్వరూప్ ఆకస్మిక మృతి దురదృష్టకరమని చెప్పిన పవన్ కల్యాణ్.. విష్ణు స్వరూప్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రామచంద్రయ్యకు మానో ధైర్యాన్ని భగవంతుడు అందించాలని అన్నారు. ఆయన కుటుంబానికి పవన్.. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు!

## రఘురామా.. ఇదేమి ర్యాగింగయ్యా బాబూ..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్మెల్యే ఉండి RRR, AP 11 AP 1111 ఈ నెంబర్ ప్లేట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. గోదావరి వెటకారానికి కేరాఫ్ గా చెప్పే డిప్యూటీ స్పీకర్ వాహనమో.. ఆయన అనుచరులకు చెందిన వాహనమో కానీ, ఈ వెరైటీ నెంబర్ ప్లేట్ తో ఏపీ రోడ్లపై చెక్కర్లు కొడుతున్న కారు అందరి దృష్టిని తెగ ఆకట్టుకుంటోంది.గత ఐదేళ్లు రచ్చబండ పేరుతో అప్పటి అధికార పక్షానికి కంట్లో నలుసులా మారిన రఘురామకు ఎన్నికల్లో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. చివరి వరకు ఆయన టికెట్ పై స్పష్టత రాకపోవడంతో సోషల్ మీడియాలో రఘురామకు అనుకూలంగా పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నడిచింది. ఎన్నికల అనంతరం కూడా రఘురామకు మంత్రి పదవి ఇవ్వాలని సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టింగులు పెట్టేవారు. చివరికి సోషల్ ఒత్తిడితోనే త్రిపుల్ %R%కు డిప్యూటీ స్పీకర్ చేశారంటున్నారు.ఇలా డిప్యూటీ స్పీకర్ అయిన రఘురామ తనకు మాత్రమే అలంకారమైన వెటకారంతో సభ్యులపై చలోక్తులు విసురుతూ సభను నడిపే తీరు ఆకట్టుకుంటోంది. ఇక ఆయన విమర్శనాస్త్రాలు ఎదుర్కొవడానికి ఇబ్బంది పడుతున్న వైసీపీ.. ప్రతిపక్ష హొదా లేదని సభను బహిష్కరించి తప్పించుకుంది.వైసీపీ సభకు రాకపోయినా రఘురామ విమర్శల బాణాల నుంచి తప్పించుకోలేకపోతోంది. ఎన్నికల అనంతరం పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అనే నెంబర్ బోర్డు ఎంతలా వైరల్ అయిందో.. ఇప్పుడు రఘురామ అనుచరులు తయారు చేసిన కారు నెంబర్ ప్లేట్ కూడా అంతే స్థాయిలో వైరల్ అవుతోంది. వైసీపీ గెలిచిన అసెంబ్లీ స్థానాలను సూచిస్తూ AP 11 AP 1111 అనే నెంబర్ ప్లేటుతో ఓ కారు ఏపీలో షికారు చేస్తోంది.
AP 11 AP 1111 నెంబరుతో ఉన్న కారు ఓరిజనల్ ఓనర్ ఎవరో? ఆ కారు అసలు నెంబర్ ఏదో తెలియకపోయినా, సోషల్ మీడియాలో ఈ ఫొటో ట్రోల్ చేస్తున్నవారు డిప్యూటీ స్పీకర్ రఘురామ మద్దతుదారులే అని అభిప్రాయపడుతున్నారు. దీంతో రఘురామ ర్యాగింగ్ వేరే లెవల్లో ఉంటుందని కామెంట్లు చేస్తున్నారు.

# టీమిండియా గెలిచేనా..! MCGలో మునపటి ఛేజింగ్ రికార్డులేంటి..?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్– ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరుగుతోన్న బాక్సింగ్ డే టెస్ట్ రసవత్తరంగా సాగుతోంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో తేలిపోయిన భారత బౌలర్లు.. సెకండ్ ఇన్నింగ్స్ లో పర్వాలేదనిపి స్తున్నారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 9 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. క్రీజులో నాథన్ లైయన్ (41బి), స్కాట్ బోలాండ్ (10బి) ఉన్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 333 పరుగుల లీడ్‌లో ఉంది.

**ఆఖరి రోజు.. 98 ఓవర్లు..!**

ఈ టెస్టులో మిగిలివుంది ఆఖరి రోజు మాత్రమే. ఆసీస్ ఇన్నింగ్స్‌ను మరో 20 పరుగులలోపు ముగించినా.. భారత లక్ష్యం 350 పరుగుల వరకూ అంచనా వేయవచ్చు. చివరి రోజు అంత పెద్ద లక్ష్యాన్ని చేధించడమంటే కష్టంతో కూడుకున్నదే. అయితే, డబ్ల్యుటిసి ఫైనల్‌కు అర్హత సాధించాలనే ఆశను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్ గెలవక తప్పదు. ఆస్ట్రేలియా ఏ లక్ష్యాన్ని నిర్దేశించినా.. చేధించే ప్రయత్నమే చేయాలి. ఈ క్రమంలో MCGలో టెస్టుల్లో అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌లు ఏవనేది చూద్దాం..

**96 ఏళ్ల క్రితం అత్యధిక ఛేజింగ్**

మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో టెస్టుల్లో అత్యధిక విజయవంతమైన ఛేజింగ్..332. అదీ 96 సంవత్సరాల క్రితం. ఇక 20వ శతాబ్దంలో ఈ వేదికపై అత్యధిక విజయవంతమైన ఛేజింగ్.. 231 పరుగులు.

2013/14 హోమ్ యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ నిర్దేశించిన 231 పరుగుల లక్ష్యాన్ని ఆతిథ్య ఆస్ట్రేలియా చేధించింది.

332: ఇంగ్లాండ్ (ఆస్ట్రేలియాపై, 1928లో) మూడు వికెట్ల తేడాతో విజయం.

297: ఇంగ్లాండ్ (ఆస్ట్రేలియాపై, 1895లో) ఆరు వికెట్ల తేడాతో గెలుపు.

295: దక్షిణాఫ్రికా (ఆస్ట్రేలియాపై, 1953లో) ఆరు వికెట్ల తేడాతో విజయం.

286: ఆస్ట్రేలియా (ఇంగ్లాండ్ పై, 1929లో) ఐదు వికెట్ల తేడాతో గెలుపు.

282: ఇంగ్లాండ్ (ఆస్ట్రేలియాపై, 1908లో) వికెట్ తేడాతో విజయం.

# మెల్‌బోర్న్ టెస్ట్: ముగిసిన నాలుగో రోజు ఆట.. 300 దాటిన ఆసీస్ ఆధిక్యం

- 333 పరుగులకు చేరుకున్న ఆసీస్ ఆధిక్యం
- జట్టును ఆదుకున్న కెప్టెన్ కమిన్స్, నాథన్ లియాన్
- ప్రస్తుతం భారత్‌పైనే ఒత్తిడి
- పిచ్ బౌలర్లకు అనుకూలిస్తే భారత్‌కు కష్టాలు తప్పనట్టే



**హైదరాబాద్ పెన్ పవర్:** బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్‌లో భారత్–ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న నాలుగో టెస్టు నాలుగో రోజు ఆట ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 9 వికెట్లు కోల్పోయి 228 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకొంటే ఆసీస్ లీడ్ 333 పరుగులకు చేరింది. భారత జట్టు 369 పరుగుల వద్ద ఆలౌట్ అయిన తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను భారత బౌలర్లు బుమ్రా, సిరాజ్ కోలుకోలేని దెబ్బతీశారు. పదునైన బంతులతో బ్యాటర్లను వణికించారు. వీరి దెబ్బకు వడివడిగా వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా ఒకానొక దశలో 91 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. అయితే, కెప్టెన్ పాట్ కమిన్స్, నాథన్ లియాన్ (41) వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశారు. ఇద్దరూ కలిసి నెమ్మదిగా పరుగులు సాధిస్తూ స్కోరు బోర్డుపై పరుగులు పేర్చుకుంటూ పోయారు. 41 పరుగులు చేసిన కమిన్స్‌ను రవీంద్ర జడేజా బోల్తా కొట్టించాడు. ప్రస్తుతం నాథన్ లియాన్ 41, స్కాట్ బోలాండ్ 10 పరుగులతో క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 358/9 వద్ద ఈ ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత జట్టు మరో 11 పరుగులు మాత్రమే జోడించి 369 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. నిన్న అద్భుత సెంచరీతో చెలరేగిన నితీశ్‌కుమార్‌రెడ్డి 114 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔట్ కావడంతో భారత జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

ఆస్ట్రేలియా ప్రస్తుతం 333 పరుగుల ఆధిక్యం సాధించి బలమైన పొజిషన్‌లోనే ఉంది. ఆటకు రేపు చివరి రోజు కావడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. నేటిలాగే రేపు కూడా పిచ్ బౌలర్లకు అనుకూలిస్తే భారత్‌కు కష్టాలు తప్పనట్టే. ఆసీస్ బౌలింగ్‌ను సమర్థంగా అడ్డుకోగలిగితే మ్యాచ్ డ్రాగా ముగుస్తుంది.

# దాదాపు 100 ఏళ్ల తరువాత.. వికెట్ పడకుండా రోజంతా ఇద్దరే బ్యాటింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** బులవాయో వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహమత్ షా– హష్మతుల్లా షాహిదీ రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. మూడో వికెట్‌కు వీరిద్దరూ 361 పరుగులు జోడించారు. వికెట్ పడకుండా రోజంతా ఇద్దరే బ్యాటింగ్ చేశారు. గతంలో ఇలాంటి ఫీట్ దాదాపు వందేళ్ల క్రితం నమోదైనట్లు రికార్డుల్లో ఉంది. ఇంగ్లీష్ బ్యాటర్లు జాక్ హాబ్స్, హెర్బర్ట్ సట్‌క్లిఫ్ రోజంతా బ్యాటింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. టెస్టుల్లో ఆఫ్ఘనిస్తాన్ తరఫున ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. రహమత్ షా(231బీ 23 ఫోర్లు, 3 సిక్స్ లు) డబుల్ సెంచరీ చేయగా.. హష్మతుల్లా షాహిదీ(141బీ 16 ఫోర్లు) సెంచరీ చేశారు. జింబాబ్వే బౌలర్లలో పసలేకపోవడం, పిచ్ సహకరించకపోవడంతో ఆఫ్ఘన్ ద్వయం చెలరేగిపోయారు. బౌండరీల మోత మోగించారు. టెస్టుల్లో ఒక్క రోజు ఆటంటే.. 90 ఓవర్లు. అన్ని ఓవర్లు అలసట లేకుండా ఇద్దరే ఆడటమంటే మామూలు విషయం కాదు.

2019 తర్వాత టెస్ట్ మ్యాచ్‌లో రోజంతా వికెట్ కోల్పోకపోవడం ఇదే మొదటిసారి.

టెస్టు క్రికెట్‌లో జింబాబ్వే బౌలర్లు ఒక్కరోజు అంతా వికెట్లేమీ తీయలేకపోవడం కూడా ఇదే తొలిసారి.అంతకుముందు జింబాబ్వే బ్యాటర్లు రెచ్చిపోయారు. ఏకంగా ముగ్గురు సెంచరీలు సాధించారు. సీన్ విలియమ్స్(154), క్రెయిగ్ ఎర్విన్(104), బ్రియాన్ బెన్నెట్(110) శతకాలు బాదారు. దాంతో, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్ లో 586 పరుగుల భారీ స్కోర్ చేశారు.

## శ్రియ శరణ్ అద్భుతమైన లుక్స్



# పొట్టి నిక్కర్ లో అందాల రకుల్



టాలీవుడ్ లో ఒకానొక సమయంలో మహేష్ బాబు సినిమాకు కూడా డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. టాలీవుడ్ లోని దాదాపు అందరు స్టార్ హీరోలతో సినిమాలు చేసిన హీరోయిన్ గా నిలిచిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ ఈ మధ్య కాలంలో కాస్త కెరీర్ పరంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. తెలుగు మరియు తమిళంలో ఆశించిన స్థాయిలో సక్సెస్ లను దక్కించుకోలేక పోతున్న రకుల్ ప్రీత్ సింగ్ ఆ మధ్య హిందీలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. ఒకానొక సమయంలో ఏడాదిలో అయిదు ఆరు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఆ సినిమాల్లో ఎక్కువ శాతం నిరాశ పరిచాయి. దాంతో అక్కడ కూడా ఆఫర్లు తగ్గాయి. హిందీ మరియు సౌత్ లో ఆఫర్ల కోసం ఈ అమ్మడు ప్రయత్నాలు చేస్తోంది. అందాల ఆరబోత విషయంలో ఈ అమ్మడు జోరు మరింత పెంచింది. కెరీర్ ఆరంభంలో కంటే ఇప్పుడు మరింత అందంగా కనిపిస్తూ ఉంది. ఇదే రేంజ్ లో అందాల ఆరబోత చేస్తే కచ్చితంగా మళ్లీ తెలుగు లో ఈ అమ్మడు బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ కామెంట్స్ వస్తున్నాయి.

తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ యొక్క ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పొట్టి నిక్కర్ లో నడుము అందాన్ని చూపిస్తూ... థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ ఉన్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే రూపంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. కనుక ఇదే రేంజ్ లో అందాలను చూపిస్తే మళ్లీ ఏదో విధంగా ఇండస్ట్రీలో రకుల్ బిజీ అవ్వడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



## సినిమాతో ప్రేమ.. షూటింగ్స్ తో డేటింగ్..
# బేబమ్మ సూపరమ్మా..?

ఉప్పెన బేబమ్మ ఈ మధ్య కాస్త డల్ అయినట్టు కనిపిస్తుంది. ఒక్క సినిమాతో ఓవర్ నైట్ స్టార్ గా ఎద్గిన అమ్మడు వరుస ఛాన్స్ లు అందుకున్నా కథల ఎంపిక లోపం వల్ల సినిమాలు ఫెయిల్ అవుతూ వచ్చాయి. నిజాన్ని త్వరగానే గుర్తించిన అమ్మడు ఇప్పుడు స్టోరీ సెలక్షన్ మీద ఎక్కువ ఫోకస్ చేస్తుంది. రీసెంట్ గా నాగ చైతన్య కస్టడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కృతి శెట్టి ఆ సినిమాతో హిట్ కొడుతుందని అనుకుంటే అది కాస్త యావరేజ్ గా నిలిచింది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్ టైం లో లవ్ డేటింగ్ లాంటి విషయాల మీద ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది అమ్మడు. ప్రేమ స్వచ్ఛమైనది కానీ తను ఇప్పటివరకు అమ్మా నాన్న ప్రేమని తప్ప మరే ప్రేమ చూడలేదని అంటుంది. తనకు కాలేజ్ డేస్ లో బోలెడన్ని లవ్ లెటర్స్ వచ్చాయని కాని తనకు మాత్రం ఎలాంటి ఫీలింగ్ కలగలేదని అంటుంది. ప్రస్తుతం కృతి శెట్టి ఎవరినైనా ప్రేమిస్తుందా అన్న ప్రశ్న అడిగితే నేను అమ్మానాన్నలను ప్రేమిస్తున్నా అంటూ తెలివైన ఆన్సర్ ఇస్తుంది. అంతేకాదు సినిమాలతో ప్రేమ.. షూటింగ్స్ తో డేటింగ్ అంటూ కామెడీ చేస్తుంది. ప్రస్తుతానికి సినిమాలే తనకు ఇంపార్టెంట్ అని మిగతా విషయాన్ని తర్వాత అంటుంది. బేబమ్మ గా తెలుగు ప్రేక్షకులను అలరించిన కృతి శెట్టి వరుస సినిమాలు చేస్తున్నా కమర్షియల్ హిట్లు మాత్రం కొట్టట్లేదు. అందుకే ఇప్పుడు వచ్చిన ప్రతి ఛాన్స్ చేయకుండా కేవలం సెలెక్టెడ్ సినిమాలనే చేస్తూ వస్తుంది.

నాగ చైతన్య కస్టడీ కూడా వచ్చేసింది. ఇక నెక్స్ట్ అమ్మడు శర్వానంద్ సినిమాపై హోప్స్ పెట్టుకుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com